




# శ్రీచక్ర

https://www.sreechakranews.com








సంపుటి 10 | సంచిక 304 | కర్నూలు | గురువారం డిసెంబర్ 04 2025 SREECHAKRA TELUGU DAILY పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi


# రైతు సమస్యలపైనే ప్రధాన దృష్టి

రైతన్నకు అండగా ఉండడమే మా విధానం

నీటి వనరులు పెంచేందుకు అనేక ప్రయత్నాలు

గోదావరి జలాలను కృష్ణా నదికి కలిపి చూపాం

విద్యుత్ ఛార్జీలు పెంచే ఆలోచన లేదు

వైసిపి హయాంలో వ్యవసాయ రంగాన్ని భ్రష్టు పట్టించారు

నల్లజర్లలో రైతన్నా మీకోసంలో సిఎం చంద్రబాబు



కాకినాడ,డిసెంబర్3(: ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఆధారిత రాష్ట్రం కనుక రైతుల సమస్యలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నాం అని సిఎం చంద్రబాబు అన్నారు. రైతన్నకు అండగా ఉంటామనేది మా మొదటి నినాదం అన్నారు.. నీటి వనరులు పెంచేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లలో సీఎం చంద్రబాబు బుధరం పర్యటించారు. 'రైతన్నా మీకోసం' కార్యక్రమంలో భాగంగా రైతులు, రైతు కుటుంబాలతో ఆయన ముఖాముఖి నిర్వహించారు. ప్రభుత్వ పంచ సూత్రాలపై అవగాహన కల్పించారు. వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి.. అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చాం.. అమలు చేస్తున్నాం. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నాం. సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయ్యింది. గోదావరి జలాలను కృష్ణా నదికి కలిపాం. రాబోయే రోజుల్లో గోదావరిని వంశధారకు కలుపుతాం. పెన్నా వరకూ తీసుకెళ్తాం. విద్యుత్ ఛార్జీలను పెంచేది లేదని మరోసారి స్పష్టం చేస్తున్నా. ఛార్జీలను పెంచకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం అని అన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఈ సదర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ హయాంలో వ్యవసాయం అస్తవ్యస్థం అయ్యిందని విమర్శలు చేశారు. వైసీపీ హయాంలో భూ రికార్డులు తారుమారు చేశారని ఆరోపించారు. ఇష్టం ఉంటే భూరికార్డులు అలాగే ఉంచారని.. భూములు కబ్జా చేయాలనుకుంటే 22ఏ విధానం అనుసరించారని ఆరోపించారు. వైసీపీ నేతలు ప్రభుత్వ భూములను ఆక్రమించారని విమర్శించారు. గత జగన్ ప్రభుత్వం పశువులకు దాణా కూడా ఇవ్వలేదు. వైసీపీ అక్రమాలను అరికట్టేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పవన్ కల్యాణ్‌లతో కూటమి కట్టి ఎన్నికలకు వెళ్లామని గుర్తుచేశారు. చరిత్రలో ఎప్పుడు లేనంతగా రికార్డు సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని చెప్పుకొచ్చారు. 90 శాతం సీట్లను తమకు ప్రజలు ఇచ్చారని గుర్తుచేశారు. మొదటగా రైతుల సమస్యలు పరిష్కరించాలని అనుకున్నామని దాని తర్వాత మిగతా సమస్యలపై దృష్టి సారించామని తెలిపారు. వ్యవసాయంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయం ద్వారా రాష్ట్రానికి ఆరు శాతం ఆదాయం వస్తుంది. వ్యవసాయంలో ఖర్చులెక్కువ ఆదాయం తక్కువ. వ్యవసాయమే మన బలం.. ఈరంగంలో అనేక సమస్యలు వస్తున్నాయి. వ్యవసాయంలో జూదం వద్దు. సమస్యలు అన్ని ఒకేసారి పరిష్కారం అయిపోతాయని భావించి ముందుకు వెళ్తే, నష్టపోయే పరిస్థితి వస్తుంది. రైతుల్లో కూడా మార్పు రావాలి. మేము రూపాయి ఇస్తే, మీరు రుపాయి ఖర్చుపెట్టాలి. చదువుకునే పిల్లలు కూడా వ్యవసాయం అంటే పొలాల నుంచే నేర్చుకోవాలి. ప్రస్తుతం వ్యవసాయ పనులు చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదు.. అందుకే యాంత్రికరణ జరగాలి. మీరు పండించే పంట విలువ ఇక్కడ పరిస్థితిపై ఆధారపడి ఉండదు. ఇతర దేశాలు, ఇతర ప్రాంతాల్లో జరిగే పరిణామాలపై ఆధారపడి ఉంటాయి. రైతులకు గిట్టుబాటు ధర రావాలి.. ఆదాయం పెరగాలి. ఇప్పుడు ఉభయ గోదావరి జిల్లాల వాసులతో పాటు రాయలసీమ వాసులకు డయాబెటిస్ వస్తోంది. రాష్ట్రాన్ని ఒక మోడల్ స్టేట్‌గా మారుస్తాం. విశాఖపట్నం సమ్మిట్‌లో ఎప్పుడూ రానంత పెట్టుబడులు వచ్చాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.. జఠిలమైన



వ్యవసాయ సమస్య పరిష్కరించడానికి ఐదు సూత్రాలు అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగానే నీటి భద్రత కల్పించాలని భావించాం. గంగా, కావేరి నదులను అనుసంధానం చేయాలని అప్పుడే నిర్ణయించాం. ఇప్పట్లో సాధ్యం కాదని, కనీసం మన రాష్ట్రంలో నదులను అనుసంధానం చేయాలని నిర్ణయించాం. గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు ఎట్టి పరిస్థితుల్లోనైనా తరలిస్తాం. భూమిని జలాశయంగా చేసి, భూగర్భ జలాలు పెంచితే నీటి సమస్య ఉండదు. నేను చాలా సమస్యలు పరిష్కరించగలను. రైతుల సమస్యలు పరిష్కరించడానికి కొంత సమయం పడుతుంది. గతంలో రాష్టాన్ని అస్తవ్యస్థం చేశారు. కరెంటు చార్జీలను పెంచబోం. గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేస్తున్నాం. పెన్నా నది వరకు తీసుకువెళ్తాం.

## అమరావతిలో పచ్చదానికి పెద్దపీట

మీడియా సమావేశంలో మంత్రి నారాయణ



అమరావతి,డిసెంబర్3: రాజధాని అమరావతిలో 30 శాతం గ్రీనరీకి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. పచ్చదనంతో కూడిన రాజధాని నిర్మాణం మా లక్ష్యం అన్నారు. అందుకే గ్రీన్ బెల్ట్‌కు అధికంగా ప్రాధాన్యం కల్పిస్తున్నామిన చెప్పారు. 133.3 కి.మీ పరిధిలో ప్లాంటేషన్ ప్రణాళిక రూపొందించినట్లు ఆయన వివరించారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాజధాని పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పార్కుల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నాం. శాఖమూరు, కృష్ణాయపాలెం, నీరుకొండలో గ్రీన్ అండ్ బ్లూ కాన్సెప్ట్‌కు ప్రణాళిక రూపొందించాం. జనవరి నెలాఖరు నాటికి టెండర్ల పక్రియ పూర్తిచేస్తాం. సీజన్‌లో వచ్చే ఫ్లవర్స్ ప్రకారం బ్యూటిఫికేషన్ ఉంటుంది. 22 రోడ్లలో రెండువైపులా బఫర్ జోన్‌లో గ్రీనరీ అభివృద్ధి జరుగుతుంది. రాజధాని రైతుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం. 29 గ్రామాల పరిధిలో భూసమీకరణకు రైతులకు ఇవాళ్టికీ విజ్ఞప్తి చేస్తున్నాం. రైతులు ముందుకు రాకుంటే భూసేకరణకు వెళ్తాం. సీఆర్డీఏ కార్యాలయంలోనే రైతుల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేస్తాం అని నారాయణ తెలిపారు.

## అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

మౌలిక సదుపాయాల కల్పనలో క్రియాశీకంగా ఉండాలి

గ్రామస్థాయి నుంచి అభివృద్ది కమిటీల ఏర్పాటు

జనసేన ముఖ్యనేతల సమావేశంలో పవన్ దిశానిర్దేశం

మంగళగిరి,డిసెంబర్3( జనసేన పార్టీ నాయకులు, శ్రేణులు తమ పంచాయతీల నుంచి పార్లమెంట్ నియోజకవర్గం వరకు అభివృద్ధిలో భాగం కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో పవన్ సమావేశం నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రాంత అభివృద్ధిలో అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో క్రియాశీలకంగా వ్యవహరించేలా పార్టీ శ్రేణులను ముందుకు తీసుకువెళ్దామన్నారు. జనసేన పార్టీ కమిటీల నిర్మాణంలో భాగంగామన్నారు. గ్రామ స్థాయిలో అయిదుగురు సభ్యులతో కమిటీని నియమించాలని, వారు గ్రామాభివృద్ధిలో భాగమయ్యేలా చేద్దామని తెలిపారు. అదే విధంగా మండల, అసెంబ్లీ, లోక్ సభ నియోజకవర్గాల అభివృద్ధిపై ఆయా కమిటీలు దృష్టి కేంద్రీకరించేలా ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి క్షేత్ర స్థాయి వరకూ జనసేన పొందిన నామినేటెడ్ పదవుల వివరాలను పరిశీలించారు పవన్ కల్యాణ్. మిగిలిన పదవుల భర్తీపై పలు సూచనలు చేశారు. కూటమి ధర్మాన్ని అనుసరించి ముందుకు వెళ్లడంతోపాటు, పార్టీ కోసం చిత్తశుద్ధితో పని చేసినవారికి వివిధ దశల్లో గుర్తింపు, బాధ్యతలను అందించే దిశగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పార్టీ కమిటీల నియామకంపై పవన్ పలు సూచనలు ఇచ్చారు. పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ స్థాయి నుంచి నియోజక వర్గ స్థాయి వరకూ పార్టీ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలకు అయిదుగురు చొప్పున సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలి. ఆ సభ్యులు స్థానికంగా అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించాలి. ఇప్పటికే పైలెట్ ప్రాజెక్ట్ గా పిఠాపురంలో నియోజకవర్గ స్థాయిలో అయిదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటైంది.. ఆ కమిటీ పని తీరును మదింపు చేసి రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, మండల, నియోజకవర్గ కమిటీలు రూపకల్పన చేయాలి. పార్టీ అంతర్గత వ్యవహారాలకు సంబంధించి నెలకొనే అంశాలను పరిష్కరించేందుకు ఉద్దేశించిన కాన్ ఫ్లిక్ట్ మేనేజ్మెంట్ విభాగాన్ని కేంద్ర కార్యాలయం నుంచే పర్యవేక్షించాలి. ఈ విభాగంలో 11 మంది వరకు సభ్యులను నియమించాలి. ఈ విభాగం ముందుకు వచ్చే అంశం ప్రాధాన్యం, తీవ్రతను బట్టి ముగ్గురు లేదా మొత్తం విభాగంలోని సభ్యులు చర్చించి పరిష్కరించాలని పార్టీ అధినేత పవన్ దిశానిర్దేశర చేశారు. ఇకపై ప్రతి కమిటీలో మహిళలకు స్థానం



కల్పించాలని స్పష్టం చేశారు. అయిదుగురు సభ్యులు ఉండే కమిటీలో తప్పనిసరిగా ఒకరు, గరిష్టంగా ఇద్దరు వీర మహిళలు సభ్యులుగా ఉండాలి.. 11మంది సభ్యులు ఉండే కమిటీ ముగ్గురు వీర మహిళలకు స్థానం ఇస్తూ కమిటీలు ఉండాలని నిర్ణయించారు.

## పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు దురదృష్కరం

వెంటనే వాటిని వెనక్కి తీసుకోవాలి: వైఎస్ షర్మిల

విజయవాడ,డిసెంబర్3: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కోనసీమ కొబ్బరి చెట్ల నష్టానికి 'తెలంగాణ ప్రజల దిష్టి తగిలింది' అని చేసిన వ్యాఖ్యలను పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల తీవ్రంగా ఖండించారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల మధ్య వైషమ్యాలను పెంచుతాయని, ఉప ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతారాహిత్యాన్ని చూపుతున్నాయని పేర్కొన్నారు. పవన్ వ్యాఖ్యలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. పవన్ కళ్యాణ్ వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అన్నదమ్ముల్లాంటి ఆంధ్ర-తెలంగాణ మధ్య మళ్లీ ప్రాంతీయ విద్వేషాలను నింపే ప్రయత్నం అంగీకారయోగ్యం కాదని ఆమె అన్నారు. సముద్రం నుంచి పైకివస్తున్న ఉప్పునీటి ప్రవాహం,చర్యలు చేపట్టకపోవడం, దీర్ఘకాలిక శ్రద్ధ లేకపోవడం వల్ల లక్షల సంఖ్యలో కొబ్బరి చెట్లు ఎండిపోతున్నాయని ఆమె ఆరోపించారు. అయితే, ప్రభుత్వ వైఫల్యాన్ని దిష్టి మీద రుద్దడం సరికాదు అన్నారు. కొబ్బరి రైతులకు వెంటనే ఉపశమనం కల్పించాలి. కోనసీమ రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని.. ఉప్పునీటి ముప్పును నివారించేందుకు అత్యవసర చర్యలు తీసుకోవాలి.

## ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి

అన్నదాతలకు హోంమంత్రి అనిత సూచన

అనకాపల్లి,డిసెంబర్3 రైతుల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని హోంమంత్రి అనిత అన్నారు. రైతుల సంక్షేమం లక్ష్యంగా చంద్రబాబు అనేక కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారని అన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు, రైతులు ప్రకృతి వ్యవసాయానికి మళ్లాలని అన్నారు. అనకాపల్లి జిల్లా ఎస్. రాయవరం మండలం గుడివాడ గ్రామంలో 'రైతన్నా మీ కోసం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హోంమంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి






చూపాలని అన్నదాతలకు సూచించారు. రైతుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా పాయకరావుపేట నియోజవర్గంలో సుమారు 30 వేల మంది రైతులకు రూ. 25 కోట్ల మేర సాయం అందించినట్లు చెప్పారు. తుపానులో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

## ఏపీలో ఎన్నికల హడావుడి.. షెడ్యూల్ విడుదల

అమరావతి, డిసెంబరు3 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఈ నెల 23వ తేదీన జరగనున్నాయి. ఏపీ సెక్రటేరియట్ ఉద్యోగుల సంఘం ఎన్నికల నిర్వహణపై అప్సా అధ్యక్షులు కాకర్ల వెంకటరామిరెడ్డి అధ్యక్షతన కార్యవర్గం ఇవాళ(బుధవారం) సమావేశమైంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నెల 29వ తేదీతో ప్రస్తుత అప్సా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ప్యానెల్ పదవీ కాలం ముగియనుంది. ఈ క్రమంలో ఎన్నికలను ఈ నెల(డిసెంబరు) 23వ తేదీన నిర్వహించాలని అప్సా కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను అప్సా కార్యవర్గం ప్రకటించింది. తొమ్మిది కేటగిరీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో సచివాలయం, అసెంబ్లీతో కలిపి 1200 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

ఎన్నికలు జరిగే తొమ్మిది కేటగిరీలు ఇవే..

1) అధ్యక్షుడు
2) ఉపాధ్యక్షుడు
3) ఉపాధ్యక్షుడు (మహిళలు)
4) ప్రధాన కార్యదర్శి
5) అదనపు కార్యదర్శి
6) జాయింట్ సెక్రటరీ (సంస్థలు)
7) జాయింట్ సెక్రటరీ (క్రీడలు)
8) జాయింట్ సెక్రటరీ (మహిళ)9) కోశాధికారి పదవులకు ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికల షెడ్యూల్..డిసెంబరు 11వ తేదీ జనరల్ బాడీ సమావేశం. 12వ తేదీ నోటిఫికేషన్ విడుదల.15, 16వ తేదీల్లో నామినేషన్ల స్వీకరణ.

# సంపాదకీయం

## ఎన్నికల సంస్కరణలపై చర్చించే దమ్ముందా ?

పార్లమెంట్ బృహత్తర బాధ్యతను నిర్వహించాల్సిన సమయం వచ్చింది. సమగ్ర ఎన్నికల సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. దీనిపై పార్లమెంటులో విస్తృతంగా చర్చించాలి. అప్పుడే ఎన్నికల సంస్కరలప చర్చకు అర్థం ఉంటుంది. రాజ్యాంగం గురించి గొప్పగా మాట్లాడుతున్న వారు అప్పుడు రాజ్యాంగ వ్యవస్థ అయిన ఎన్నికల సంఘంపై విమర్శలు చేయకుండా చూడాలి. అలా చేస్తే శిక్షార్హులు అయ్యేలా చేయగలగాలి. సర్‌పై చర్చకు అనుమతించినందున పార్లమెంటులో ఈ అంశాలన్నీ చర్చించాలి. అనేకానేక అంశాలు చర్చ చేయాలి. దేశానికి గుదిబండగా మారిన గవర్నర్ వ్యవస్థ, మండలి వ్యవస్థ, ఒకే వ్యక్తి వరుసగా చట్టసభలకు ఎన్నికవ్వడం, డబుల్ పెన్షన్లు పొందడం వంటివన్నీ ఈ ఎన్నికల సంస్కరణలపై జరిగే చర్చలో భాగం కావాలి. అప్పుడే ప్రభుత్వ చిత్తశుద్ది కూడా బయట పడుతుంది. అలాగే విపక్షాల నిజాయితీ కూడా ప్రజలకు తెలుస్తుంది. ఎన్నికల సంస్కరణలపై తూతూ మంత్రంగా చర్చించకుండా ఈ అంశాలను చర్చించాలి. విపక్షాల సూచనలనలు పరిగణించాలి. అంతా కలసి సమగ్ర ఎన్నికల విధానం రూపొందించాలి. అలాగే ఇటీవల పదవీ విరమణ చేస్తూ..సుప్రీం ప్రధాన న్యయామూర్తి బిఆర్ గవాయ్ చేసిన వ్యాఖ్యలను  కూడా చర్చించాలి.ఎస్సీల్లో క్రిమిలేయర్ వర్తింప చేయాలన్న సూచనలు సభముందు చర్చించాలి. ఇకపోతే... ఇంతగా టెక్నాలజీ పెరిగినా..దానిని కేంద్ర ఎన్నికల సంఘం వినియోగించుకోవడం లేదేమో అని అనిపిస్తోంది. ఓటర్ల జాబితా మొదలు, ఓటరు నమోదు ప్రక్రియన సులువుగా చేయడం, లేని ఓట్లను తొలగించడం అన్నది సులువుగా జరగాలి. కానీ అలా జరగడం లేదనడానికి సర్ ప్రక్రియపై వస్తున్న ఆరోపణలు రుజువు చేస్తున్నాయి. ఇటీవల ఉడాయ్ 2కోట్ల ఆధార్ కార్డులన నంబర్లను తొలగించింది. ఎక్కడా గందరగోళ రాలేదు. కాన ఓటు వషయంలో మాత్రం గందరగోళం ఏర్పడుతోంది. పక్కాగా ఓటు నమోదు, జాబితా రూపకల్పన, ఓటు అడ్రస్ మార్చుకోవడం అన్నది కంప్యూటర్ ముందు కూర్చుంటే అయిపోవాలి. నకిలీ ఓటు నమోదయితే కఠిన శిక్షలు అమలు కావాలి. మనదేశంలో తప్పులకు కఠిన శిక్షలు లేకపోవడం వల్లనే నేరాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇప్పటికైనా కేంద్ర ఎన్నికల సంఘం ఈ తరహాలో ఆలోచన చేయాలి. ఓటును ఆధార్‌తో అనుసంధానం చేయడమే గాకుండా పక్కా ఓటరు కార్డు, జాబితాను రూపొందించాలి. సర్ లాంటి ప్రక్రియను ప్రతి ఎన్నికలకు ముందు జరపాలి. దొంగ ఓట్లను, చనిపోయిన వారి ఓట్లను నిరంతరం తొలగించేలా వ్యవస్థను రూపొందించాలి.  ఇకపోతే భారత ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్, దాని అమలు విధానం సర్వత్రా చర్చనీయాంశంగా  మారిన నేపథ్యంలో భవిష్యత్‌లో ఇలాంటి వివాదాలు రాకుండా పక్కాగా లక్ష్యాలను నిర్దేశించేలా పార్లమెంట్ చట్టాలను ఆమోదించాలి. కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తోపాటు గుజరాత్‌లో సర్‌పై వివాదాలు రాకుండా చేయగలగాలి. ఇకపోతే బిఎల్ఓల మృతి వార్తలను దీనికి ఆపాదిస్తూ అసలు వ్యవస్థ పనిచేయకుండా చేయాలన్న మమతా బెనర్జీ లాంటి వారికి గట్టిగా సమాధానం చెప్పాలి. బీహార్‌లో ప్రారంభమైన ఎస్ఐఆర్ పక్రియ రాజ్యాంగబద్ధతపై సుప్రీంకోర్టు విచారించింది. ఇసి నుంచి వివరాలు తీసుకుంది. అయినా వివాదాలు సృష్టంచేందకు విపక్షాలు చేస్తున్న ప్రయత్నాలు సరికాదు. ఇది రాజ్యాంగ విధులను అడ్డుకోవడం తప్ప మరోటి కాదు. ఓటర్లు బూత్ లెవల్ అధికారుల ద్వారా అందజేయ బడిన ఎన్యూమరేషన్ ఫారాలను నింపి, తమ వివరాలను 2002-2005 నాటి ఓటర్ల జాబితాలతో సరిపోల్చాలి. 12 రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎక్కువ మంది ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశామని ఇసిఐ చెబుతున్నది. నిజమైన ఓటర్లు నింపాదిగా ఉండవచ్చు.  వచ్చే నెలలో విడుదల కాబోయే ముసాయిదా జాబితాల్లో నమోదుకి అవసరమైన పత్రాలపై కూడా గందరగోళం లేకుండా చూడాలి. ఇంటింటికీ వెళ్లాలని చెప్పిన మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్తాయిలో బిఎల్‌వోలు పనిచేయాలి. పక్కాగా సమాచారం సేకరించాలి. ప్రతి ఓటరూ పాత రికార్డులు లేదా ఇసిఐ పేర్కొన్న పత్రాల ఆధారంగా తన చెల్లుబాటు నిరూపించాలి. సవరించిన జాబితాల్లో తప్పుడు నమోదు సమస్యలను కూడా పరిశీలించడం ద్వారా ఎక్కడా ఎలాంటి అపోహలకు తావులేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. సార్వత్రిక వయోజన ఓటుహక్కును పరిరక్షించేందుకు, సాంకేతిక ఆధారిత డీ డూప్లికేషన్ తోపాటు, మరింత ఓర్పుతో ఇంటింటికీ వెళ్లి ధృవీకరణ చేసే పద్ధతిని ఇసిఐ ఎంచుకోవాలి. ప్రధానంగా టెక్నాలిజితీ నకిలీ ఓట్లకు చెక్ పెట్టవచ్చు. ఎఐ వినియోగం పెంచుకోవాలి. వయోజనులందరికీ ఓటుహక్కు పరిరక్షణ కంటే మరో ధర్మం ఉండరాదు. ఎన్నో సంవత్సరాలుగా ఓటర్ల జాబితాల్లో ఉన్న పౌరులు తమ అర్హతను నిరూపించుకోవాల్సిన పరిస్థితి రాకుండా చూడాలి.

# తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి

**రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు మరోసారి వైసీపీ ఎంపీలు గురుమూర్తి, మేడా రఘునాథ రెడ్డి వినతి**



తిరుపతి,డిసెంబర్ 03(శ్రీచక్ర)తిరుపతి జిల్లాలో రైల్వే సేవల అభివృద్ధికి సంబంధించి కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్‌తో వైసీపీ లోక్‌సభ ఎంపీ మద్దిల గురుమూర్తి, రాజ్యసభ ఎంపీ, రైల్వే స్టాండింగ్ కమిటీ మెంబర్ మేడా రఘునాథ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అభ్యర్థనలు చేశారు. తిరుపతి ప్రాంత రైల్వే వ్యవస్థను బలోపేతం చేయడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం కోసం వెంటనే చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఆయనకి వివరించారు.ముఖ్యంగా కొన్ని దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న బాలాజీ రైల్వే డివిజన్‌ను తిరుపతి కేంద్రంగా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. దేశంలోనే తిరుపతి అత్యంత రద్దీ ఉన్న పుణ్యక్షేత్రం అని రైల్వే మంత్రికి వివరించారు. కాగా ప్రస్తుతానికి రైల్వే లైన్లు పలు డివిజన్లలో విభజించబడడంతో పరిపాలనా సమస్యలు, పనుల అనుమతుల కోసం జాప్యం, వెరసి సేవల నాణ్యతలో లోపాలు ఎదురవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతి రైల్వే స్టేషన్ కూడా రూ.300 కోట్లతో అప్‌గ్రేడేషన్ చేస్తుండడంతో బాలాజీ డివిజన్ ఏర్పాటు అవసరాన్ని మరింత బలపరుస్తుందని ఆయనకి స్పష్టం చేశారు. బాలాజీ డివిజన్ ఏర్పాటు అంశంపై ఎంపీ గురుమూర్తి గతంలో రెండు దఫాలు పార్లమెంటులో ప్రస్తావించిన విషయం విదితమే.అలాగే, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని అత్యవసరంగా ఆమోదించాలని ఎంపీ గురుమూర్తి విజ్ఞప్తి చేశారు.వెస్ట్ రైల్వే స్టేషన్‌లో దక్షిణం వైపు దారి మూసివేతతో ఎమ్మార్ పల్లి, పద్మావతి నగర్, ఎస్వీ నగర్, ఉల్లిపట్టెడ ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని,వారు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు ఈ ఫుట్ ఓవర్ బ్రిడ్జి అత్యంత కీలకమని మంత్రికి వివరించారు. అలాగే నగరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి రోజా విజ్ఞప్తి మేరకు పుత్తూరు యార్డ్ కిమీ 111/800?900 స్థానిక ధర్మరాజుల గుడి ఎదురుగా రైల్వే ట్రాక్ సమస్యను అధిగమించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ర్యాంపు ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు.అదేవిధంగా,ప్రజల డిమాండ్ మేరకు వెందోడు, నాయుడుపేట రైల్వే స్టేషన్లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపేజీలు కల్పించాలని ఎంపీలు ఆయనని కోరారు. నవజీవన్ ఎక్స్‌ప్రెస్, భగత్ కి కోఠి, ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌లకు నాయుడుపేటలో స్టాపేజీ ఇవ్వడం, అలాగే కృష్ణా ఎక్స్‌ప్రెస్, తిరుపతి?పూరీ ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ తోపాటుగా తిరుపతి, గూడూరు ప్యాసింజరు రైళ్లను పునరుద్ధరణ చేయాలని వారు అభ్యర్థించారు. తిరుపతి పరిసర ప్రాంతాల అభివృద్ధికి అత్యవసరమైన ఈ అంశాలను పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎంపీలు కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ ని కోరారు.

# అప్రమత్తమైన విద్యుత్ శాఖ అధికారులు

**చెందోడు సబ్ స్టేషన్ కేంద్రాన్ని చుట్టుముట్టిన వర్షపు నీరు జలదిగ్బంధంలో నివాస గృహాలు, పశువుల ఆసుపత్రి,విద్యుత్ సబ్ స్టేషన్ లు ...,**







కోట డిసెంబర్ 3 (శ్రీ చక్ర) : ద్విత్వా తుఫాన్ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం నుండి రాత్రి పది గంటల వరకు అకాల వర్షంతో ఎక్కడపడితే అక్కడ రోడ్లు,నివాస గృహాలు,విద్యానగర్ ప్రభుత్వ పశువుల ఆసుపత్రి,విద్యుత్ సబ్స్టేషన్,తదితర లాంటివన్నీ ఒక్కసారిగా జలదిగ్బందిగా మారాయి.దీంతో ప్రజలు పలు రకాల ఇబ్బందులు ఎదుర్కోవడం జరిగింది.విద్యానగర్ సబ్ స్టేషన్ ఆవరణంలో వర్షపు నీరు వెళ్లడానికి మార్గం లేకపోవడంతో సబ్స్టేషన్ ఆవరణ మొత్తం జలదిగ్బంధమైంది.అదే విధంగా విద్యానగర్ లో ఉన్న పశువుల ఆసుపత్రి పరిస్థితి కూడా వర్షపు నీటితో మునిగింది.పలు నివాస గృహాల్లోకి వర్షపు నీరు చేరుకోవడంతో ఆ నీటిని ప్రత్యేకంగా మోటార్ సాయంతో బయటకు తొలగిస్తున్నారు.పలు గృహాల్లోకి వర్షపు నీరు చేరడంతో గృహ సామాగ్రి మొత్తం తడిసిపోయాయి. అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో రోడ్ల మీదే వర్షపు నీరు నిల్వ ఉ ఒడడంతో ప్రయాణికుల రాకపోకలు స్థంభించాయి. దీనితో బుధవారం మధ్యాహ్నం పలువురు టీడీపీ నాయకులు చొరవతో విద్యానగర్ లో జేసిబి సాయంతో రోడ్డు ప్రక్కనే కాలువను తీసి నీటిని తొలగించారు.అయితే మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి పది గంటల వరకు ఎడతెరపి లేకుండా వర్షం రావడంతో ఒక్కసారిగా ప్రజలు నానా రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.మంగళవారం రాత్రి నుండి బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకుండా పోయింది.అయితే విద్యానగర్ లోని సబ్ డివిజనల్ కార్యాలయంలో వర్షపు నీరు అత్యధిక శాతంతో నిల్వ ఉండడంతో సమాచారం తెలుసుకున్న తిరుపతి విద్యుత్ శాఖ జిల్లా ఎస్ ఈ చంద్రశేఖర రావు ప్రత్యేకంగా సంఘటన స్థలానికి చేరుకుని సబ్ స్టేషన్ యొక్క స్థితిగతులను క్షుణ్ణంగా స్థానిక విద్యుత్ శాఖ అధికారులను అడిగి తెలుసుకోవడం జరిగింది.వర్షపు నీరు విద్యుత్ సబ్ స్టేషన్ కార్యాలయంలో నిల్వ లేకుండా బయటకు వెళ్లడానికి తగు ఏర్పాట్లను చేస్తామని తిరుపతి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ చంద్రశేఖర రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ ఈ చంద్రశేఖర రావు గూడూరు,ఈ ఈ నరేందర్ రెడ్డి,నాయు డుపేట ఈఈ శ్రీనివాసులు,నాయుడుపేట డి ఈ వరప్రసాద్ రెడ్డి,గూడూరు డి ఈ ప్రసాద్,కోట ఏ ఈ అనంతరావు, చెందోడు ఏఈ శశికళ,కోట,వాకాడు,చిట్టమూరు మండలాల విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# హాలహర్వి పోలీసు స్టేషన్ ను వార్షిక తనిఖీ చేసిన కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్






ఆదోని, డిసెంబర్ 3 (శ్రీచక్ర): హాలహర్వి పోలీసు స్టేషన్ ను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం వార్షిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు,  వాటి పురోగతి పై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు.డ్రంకెన్ డ్రైవ్, ఒపెన్ డ్రింకింగ్ పై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టాలన్నారు. కేసులు నమోదుచేసి శిక్షలు పడేవిధంగా చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులను చేధించి  రికవరీలు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్ ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సైబర్ నేరాలపై, మహిళల చట్టాల పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా ఎస్పీతో పాటు పత్తికొండ డిఎస్పీ వెంకటరామయ్య , ఆలూరు సిఐ రవి శంకర్ రెడ్డి,  డి సి ఆర్ బి సి ఐ గుణశేఖర్ బాబు, ఎస్సై మారుతి, మన్మథ విజయ్ ఉన్నారు.

## కీలపూడి సచివాలయంను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే



పిచ్చాటూరు, డిసెంబర్ 03(శ్రీచక్ర):పిచ్చాటూరు మండలం కీలపూడి గ్రామ సచివాలయాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు.ఎమ్మెల్యే కీలపూడి గ్రామ సచివాలయానికిచేరుకొనిఉద్యోగులహాజరుపట్టీని  పరిశీలించారు.అనంతరం కార్యాలయం లోని రికార్డులను పరిశీలించి ఉద్యోగులకు దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు కూటమి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## పిచ్చటూరు అరణీయర్ ప్రాజెక్ట్ సందర్శించిన ఎమ్మెల్యే



పిచ్చాటూరు, డిసెంబర్ 03(శ్రీచక్ర):సత్యవేడు నియోజకవర్గం శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం,పిచ్చాటూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు,ఆరణియార్ ప్రాజెక్టును సందర్శించారు. జలాశయం లోకి నీరు ఎంత చేరింది?దిగువన ఉన్న పంచాయతీ ల ప్రజలకు అపాయం ఏమైనా పొంచి ఉందా! అని అధికారులను అడిగి తెలుసుకున్నారు.అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని,ఎలాంటి ఆటంకాలు జరుకుండా,జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు.

## మొండి బకాయిదారులపై ఉదాసీనత వైఖరి వీడండి

**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**ప్రతి రోజూ 2 డిస్ట్రెస్ వారెంట్లు జారీ చేయండి**

**వారంలోపు చెల్లించకుంటే వారి ఆస్తులు జప్తు**

**ప్రతి రోజూ ఏసి, డిసి, నోడల్ అధికారులు పర్యవేక్షించాలి**



కర్నూలు,డిసెంబర్ 03 (శ్రీచక్ర): నగరంలో సంవత్సరాల తరబడి లక్షల రూపాయల పన్నులు చెల్లించకుండా మొండి బకాయి దారులుగా మారిన వారిపై ఉదాసీనత వైఖరి వీడి, వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని నగంపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక కార్యాలయంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, ఆర్వోలు, నోడల్ అధికారులతో పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో మొండి బకాయిలను రాబట్టేందుకు అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్, నోడల్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ పెట్టాలని, వారివారి పరిధిలో ఉన్న మొండి బకాయిదారులకు తక్షణమే రెడ్‌నోటీసులు జారీ చేయాలని సూచించారు. అయినప్పటికీ స్పందన లభించని వారికి డిస్ట్రెస్ వారెంట్లు జారీ చేసి, వారంలోపు చెల్లించకపోతే ఆస్తుల జప్తు ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించారు. నగరంలో అధిక బకాయిలు కలిగిన వ్యాపార, వాణిజ్య సంస్థలను రోజువారీగా 2?3 చొప్పున సీజ్ చేయాలని, ఇందులో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకున్నా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విధులను సమర్ధవంతంగా నిర్వర్తించడంలో ఎలాంటి ఒత్తడిలకు తలొగ్గదని స్పష్టం చేశారు. అదేవిధంగా ట్రేడ్‌లైసెన్స్ బకాయిలు, వినోద పన్నుల వసూళ్లను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, ఆర్వోలు జునైద్, వాజీద్, ఎం.హెచ్.ఓ నాగశివప్రసాద్, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ అంజాద్ బాష తదితరులు పాల్గొన్నారు.

## మరింతగా క్షీణించిన రూపాయి

ముంబై,డిసెంబర్3():  యుఎస్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కనిష్ట స్థాయికి పడిపోయింది. ఉదయం ట్రేడింగ్‌లో 6 పైసలు తగ్గి చరిత్రలో తొలిసారిగా 90.02కి చేరుకుంది. గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 89.96 వద్ద ప్రారంభమైన రూపాయి, రికార్డు స్థాయిలో 90.15కి చేరుకుంది.  తరువాత కొంత కోలుకుని 90.02 వద్ద ట్రేడవుతోంది. ఇది దాని మునుపటి ముగింపు కంటే 6 పైసలు తగ్గింది. బ్యాంకులు అధిక స్థాయిలో యుఎస్ డాలర్లను నిరంతరం కొనుగోలు చేయడం, ఎఫ్ఐఐ ఇన్‌ఫ్లోలు కొనసాగడం దీనికి కారణమని చెబుతున్నారు. దేశీయ స్టాక్ మార్కెట్లలో, సెన్సెక్స్ 165.35 పాయింట్లు తగ్గి 84,972.92కు, నిఫ్టీ 77.85 పాయింట్లు తగ్గి 25,954.35కు చేరుకుంది. రూపాయి క్షీణత అకస్మాత్తుగా సంభవించలేదు. డిసెంబర్ నాటికి ఇది 90 దాటి దిగువకు పడిపోయింది.

## నగరంలో పన్ను ఎగవేతదారులపై కొరడా ఝులిపిస్తున్న నగరపాలక అధికారులు




కర్నూలు, డిసెంబర్ 3 (శ్రీచక్ర): నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవి కృష్ణ అధ్వర్యంలో బకాయిలు ఉన్న సముదాయాలు సీజ్. ముజఫర్ నగర్ సమీపంలోని గోవర్ధన్ నగర్ యస్.రాధాకృష్ణ మూర్తి అనే భవన యజమాని రూ.8,33,761/- లు ఆస్తి పన్ను బాకయిలు చెల్లించకపోవడంతో వ్యాపార సముదాయం సీజ్ చేశారు.

## డ్రగ్స్ వినియోగం వల్ల భవిష్యత్ అంధకారం అవుతుంది డా.కె.వేణుగోపాల్, సీఈఓ






సెట్కూరుకోడుమూరు, డిసెంబర్ 3 (శ్రీచక్ర): జిల్లా యువజన సంక్షేమ శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు మత్తుపదార్థాలు వ్యసనం - పర్యవసానాలు, సైబర్ క్రైమ్ అనే అంశాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో సెట్కూరు సీఈఓ డా. కె.వేణుగోపాల్ మాట్లాడుతూ యువతకు సిగరెట్లు, మద్యపానం సేవించడం అనేది ఫ్యాషన్ గా అలవాటు అవుతున్నదని, ఈ అలవాట్లే ముదిరిపోయి డ్రగ్స్ కు అలవాటు పడుతున్నారని, డ్రగ్స్ వినియోగిస్తున్నారని తెలిస్తే వ్యక్తిగత సంబంధాలు, బంధువులు, స్నేహితులు కూడా దూరం అవుతారని, డ్రగ్స్ వినియోగం వల్ల భవిష్యత్ అంధకారం అవుతుందని డ్రగ్స్ ఉపయోగం వల్ల యువత మరియు సమాజం మీద పడుతున్న దుష్ఫలితాలను వివరించారు. ప్రోహిబిషన్ ఒ ఎక్సైజు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్యం.మంజుల మాట్లాడుతూ డ్రగ్స్, మత్తు పదార్థాలు మానవ అవయవ వ్యవస్థలు ముఖ్యంగా మెదడు, గుండె, కాలేయం మొదలగునవి దెబ్బతింటాయని, రోగనిరోధక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని, కావున డ్రగ్స్ జోలికి వెళ్లవద్దని, డ్రగ్స్ / మత్తు పదార్థాలు వినియోగించిన లేదా డ్రగ్స్ సరఫరా చేస్తూ దొరికిన కఠిన శిక్షలు పడతాయనని, మీకు దగ్గరలో డ్రగ్స్ అమ్ముతున్న తెలిస్తే పోలీసులకు టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం జె.లక్ష్మి మాట్లాడుతూ మాదకద్రవ్యాల సరఫరా వెనుక ఉన్నవారిని సామాజికంగా బహిష్కరించాలని కోరారు. ప్రిన్సిపాల్ షైక్షావాలి మాట్లాడుతూ యువత చదువుకునే వయసులో చదువు పై మాత్రమే మనసు లగ్నం చేయాలని, చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు సూపరింటెండెంట్ డి. శ్యాంబాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతుల అభివృద్ధి సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం


### మంత్రాలయం టిడిపి ఇన్చార్జ్ ఎన్ రాఘువేంద్ర రెడ్డి

మంత్రాలయం , డిసెంబర్ 3 ,(శ్రీచక్ర) : రైతుల అభివృద్ధి ,సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రాలయం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎన్ రాఘువేంద్ర రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు బుధవారం మండల పరిధిలోని చెట్నహళ్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్ని రైతులతో ముఖముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల అభివృద్ధి , సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందన్నారు.అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతు అకౌంట్ రాష్ట్ర ప్రభుత్వం నగదు జమ చేసిందన్నారు. అంతకు ముందు తూర్పుగోదావరి జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని వివిధ శాఖల అధికారులతో వీక్షించారు. అనంతరం ఆయన చెట్నెహళ్ళి రైతులకు శాలువ కప్పి , పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రాలయం తహశీల్దార్ రమాదేవి , ఎంపిడివో నూర్జహాన్ , వ్యవసాయాధికారులు జీరా గణేష్ , తిరుమల రెడ్డి , మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ , కల్లుదేవకుంట సొసైటీ డైరెక్టర్ ఆర్ లక్ష్మన్న , మాజీ సర్పంచ్ చావిడి వెంకటేష్ , మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య , మంత్రాలయం పట్టణ అధ్యక్షులు వరదరాజు , మంత్రాలయం మండలం ఎల్లెల్సీ డీసి 5 చైర్మన్ సూగురు నరసింహా , మండల టీడీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి సారవంతం

**డ్రిప్ ఇరిగేషన్‌తో తక్కువ నీటితో అధిక దిగుబడి సాధ్యం వ్యవసాయం?టెక్నాలజీ అనుసంధానంతో రైతుల ఆదాయం పెంపు లక్ష్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**








కర్నూలు, డిసెంబర్ 03 (శ్రీచక్ర): జిల్లాలో రైతుల ఆదాయం పెంపు, ఖర్చుల తగ్గింపు, భూమి సారవంతం పెంపు దిశగా ప్రకృతి వ్యవసాయం కీలక భూమిక పోషిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్ల రైతు సేవా కేంద్రంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్న సందర్భంగా ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వీక్షించి అనంతరం గ్రామ రైతులతో సంభాషించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం పంటల ఆరోగ్యం, నేల ప్రాంతీయ జీవ వైవిధ్యాన్ని కాపాడుతుందని తెలిపారు. రసాయనాల వినియోగం తగ్గించే, నేలలో జీవ క్రియాశీలత పెంచే విధానాలను రైతులు అమలు చేస్తే అధిక దిగుబడి సహజంగానే వస్తుందని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ వినియోగం గురించి మాట్లాడుతూ?తక్కువ నీటితో అత్యధిక లాభం పొందే మార్గం ఇదేనని, ముఖ్యంగా ఉల్లి, బొప్పాయి, చీనీ, ఉద్యాన పంటల తోటల వంటి పంటల్లో డ్రిప్ సాగు పద్ధతులు రైతులకు మంచి ఆదాయం అందిస్తున్నాయని తెలిపారు. వర్షపాతం అనిశ్చిత పరిస్థితుల్లో డ్రిప్ వ్యవసాయం రైతులకు రక్షణగా నిలుస్తుందని చెప్పారు. సాయిల్ హెల్త్ కార్డులు, వాతావరణ సూచనలు, మొబైల్ యాప్స్, డ్రోన్ స్ప్రేయింగ్ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతులను వ్యవసాయంతో అనుసంధానించడం వల్ల ఖర్చులు తగ్గి, సమయానికి సరైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలు పడుతుందని అన్నారు. రైతు సేవా కేంద్రాల విధి విధానాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు, సబ్సిడీ పరికరాలు, పంటల ఇన్సూరెన్స్, మార్కెట్ లింకేజింగ్ వంటి అంశాలను రైతులకు వివరించి, వారి సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. జిల్లాలో ఏ పంట వేసినా శాస్త్రీయ పద్ధతులే పాటించాలని, సహజ వనరులను సంరక్షించే విధంగా వ్యవసాయం చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి ఖాద్రీ, తహశీల్దార్ శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

# గోరంట్ల అంగన్వాడీ కేంద్రం పని తీరు పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్

**సక్రమంగా విధులను నిర్వహించని అంగన్వాడీ టీచర్ ఫాతిమా ను విధుల నుండి తొలగించాలని ఆదేశం:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**





కర్నూలు, డిసెంబర్ 03 (శ్రీచక్ర): కోడుమూరు మండలం అంగన్వాడీ కేంద్రం పని తీరు పట్ల జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు..సక్రమంగా విధులను నిర్వహించని అంగన్వాడీ టీచర్ ఫాతిమా ను విధుల నుండి తొలగించాలని కలెక్టర్ ఐసీడీఎస్ పిడి విజయను ఆదేశించారు. బుధవారం కోడుమూరు మండలం గోరంట్ల గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసి గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న టేక్ హోమ్ రేషన్ , పిల్లలకు అందిస్తున్న పాలు, గుడ్లు తదితర పదార్థాలను, రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంగన్వాడీ కేంద్రాన్ని శుభ్రంగా లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫుడ్ రిజిస్టర్లను పరిశీలించి, అంగన్వాడీ కేంద్రంలో ఉన్న పదార్థాల స్టాక్ కు, రిజిస్టర్ లకు పొంతన కుదరకపోవడంతో కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్టర్ లో 1309 గుడ్లు స్టాక్ ఉన్నాయని, మిగిలినవి గర్భవతులకు పంపిణీ చేసినట్లు ఉండగా, ఫిజికల్ గా కేంద్రంలో 1584 గుడ్లు ఉన్నాయని గుర్తించారు. గత నెల 3 వ వారం, 4 వ వారం లో వచ్చిన గుడ్లను పూర్తి స్థాయిలో టేక్ హోమ్ రేషన్ కింద గర్భిణి, బాలింతలకు పంపిణీ చేయకుండా ఎందుకు అలాగే నిల్వ ఉంచారని కలెక్టర్ అంగన్వాడీ టీచర్ ను ప్రశ్నించారు.. టేక్ హోమ్ రేషన్ రిజిస్టర్ కూడా సక్రమంగా మెయింటైన్ చేయకుండా ఉన్నారని కలెక్టర్ అంగన్వాడీ టీచర్ పని తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలిస్తూ, పిల్లలు హాజరుకానప్పటికీ 100 శాతం అటెండెన్స్ వేశారని కలెక్టర్ తెలిపారు. అలాగే ప్రీ స్కూల్ కిట్స్ ను చూసి, వాటిని వాడనట్లు కలెక్టర్ గుర్తించారు. పిల్లలు యాక్టివ్ గా లేరని కనీసం ఏ, బి, సి, లు కూడా చెప్పలేకపోతున్నారని, పిల్లలకు ఏమి పాఠాలు నేర్పిస్తున్నారని కలెక్టర్ అంగన్వాడీ టీచర్ ను ప్రశ్నించారు.. పిల్లలతో ఏమీ రాయించకుండా పిల్లలకి ఏమి పాఠాలు చెప్తున్నారని కలెక్టర్ అంగన్వాడీ టీచర్ పని తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వయస్సు కు తగిన ఎత్తు, బరువు లేని పిల్లలు ఎంత మంది ఉన్నారని, సంబంధిత రిజిస్టర్ చూపించాలని కలెక్టర్ అంగన్వాడి టీచర్ ను ఆదేశించగా, సంబంధిత రిజిస్టర్ మెయింటైన్ చేయకపోవడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. సక్రమంగా విధులను నిర్వహించని అంగన్వాడీ టీచర్ ఫాతిమా ను విధుల నుండి తొలగించాలని కలెక్టర్ ఐసీడీఎస్ పిడి విజయను ఆదేశించారు. అంగన్వాడి సూపర్వైజర్ లు వెరిఫై చేయకుండా ఏమి చేస్తున్నారని అంగన్వాడి సూపర్వైజర్ కి నోటీస్ ఇవ్వాలని కలెక్టర్ ఐసిడిఎస్ పిడి ని ఆదేశించారు..అంగన్వాడి కేంద్రాలను, ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ వైద్యశాలలను తహసిల్దార్ లు, ఎంపిడిఓ లు ఖచ్చితంగా సందర్శించాలని కలెక్టర్ ఈ సందర్భంగా తహసీల్దార్, ఎంపిడిఓ లను ఆదేశించారు.కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి విజయ, తహసిల్దార్ నాగరాజు, సిడిపిఓ వరలక్ష్మి, సూపర్వైజర్, ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు..

# అంగవైకల్యం శరీరానికి మాత్రమే.. సంకల్పానికి కాదు

**ఉమెన్ డెవలప్మెంట్ , చైల్డ్ వెల్ఫేర్ , డిజేబుల్ ఓల్డ్ ఏజ్ , ట్రాన్స్ జెండర్ కమిటీ చైర్మన్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత**





కర్నూలు,డిసెంబర్ 03 (శ్రీచక్ర): అంగవైకల్యం శరీరానికి మాత్రమే.. సంకల్పానికి కాదని ఉమెన్ డెవలప్మెంట్ , చైల్డ్ వెల్ఫేర్ , డిజేబుల్ ఓల్డ్ ఏజ్ , ట్రాన్స్ జెండర్ కమిటీ చైర్మన్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత పేర్కొన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సునయన ఆడిటోరియం లో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో 66వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమెన్ డెవలప్మెంట్ , చైల్డ్ వెల్ఫేర్ , డిజేబుల్ ఓల్డ్ ఏజ్ , ట్రాన్స్ జెండర్ కమిటీ చైర్మన్ గౌరు చరిత ( పాణ్యం శాసనసభ్యులు) జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికి మాత్రమేనని, మనసుకు , మీరు సాధించాలని అనుకున్న సంకల్పానికి కాదని తెలుపారు. విభిన్న ప్రతిభావంతులు ప్రస్తుత సమాజంలో అన్ని రంగాలలో గణనీయంగా రాణిస్తున్నారని , సంకల్పబలంతో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక విభిన్న ప్రతిభావంతులకు చాలా పథకాలు అమలు చేస్తూ ఉందని, అందులో భాగంగా వారికి ఇచ్చే పెన్షన్ను 3000 రూపాయల నుండి 6000 రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నన్ను విమెన్ డెవలప్మెంట్ చైల్డ్ వెల్ఫేర్ , ట్రాన్స్ జెండర్ , ఓల్డ్ ఏజ్ , డిజేబుల్ విభాగాలకు చెందిన కమిటీ చైర్మన్ గా నియమించారని తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల బ్యాక్లాగ్ పోస్టుల భర్తీ , పనిచేసే ప్రదేశంలో ర్యాంప్ , లిఫ్ట్ , టాయిలెట్ సౌకర్యాలు , వసతి గృహం ను త్వరలో పూర్తి చేయించే చర్యలు చేపడతామని ఆమె తెలిపారు.. ఉద్యోగస్తులకున్న ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ సంబంధించిన సమస్యలు తొలగించే ప్రయత్నం చేస్తామని , ఎక్కువ ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ఆ విధంగానే సదరం సర్టిఫికెట్ వచ్చేలాగా విభిన్న ప్రతిభావంతుల్లో ఉన్న ఆరు విభాగాలకు చెందిన సమస్యలను కమిటీ ద్వారా చర్చలు చేసి పరిష్కరిస్తామని కమిటీ చైర్మన్ మరియు పాణ్యం శాసనసభ్యులు గౌరు చరిత హామీ ఇచ్చారు. విభిన్న ప్రతిభావంతులకు 66 వ అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా న్యాయ సేవా సాధికారత సంస్థ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల 2016 చట్టంలో 21 డిజెబిలిటీ అంశాలను చేర్చడం చేసి చట్టాన్ని బలపరచడం జరిగిందని ఇందులోని 12వ క్లాజ్ ప్రకారం అందరికీ సమన్యాయం కలిగే అవకాశం ఉందని తెలిపారు. తాను జిల్లాకు వచ్చిన తర్వాత విభిన్న ప్రతిభావంతుల కొరకు అన్ని కోర్టు కార్యాలయాల్లో ర్యాంపులు , టాయిలెట్స్ , వీల్ చైర్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు ఆసుపత్రులలో సహాయకులు లేకుండా కూడ విభిన్న ప్రతిభావంతులకు వైద్య సౌకర్యం అందించే చర్యలు తీసుకోవాలని ఈ రోజు వెబ్ నార్ ద్వారా సుప్రీంకోర్టు జడ్జ్ జస్టిస్ విక్రమ్ నాథ్ గారు అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు ఇవ్వటం జరిగిందని తెలిపారు. ఆర్టీసీ బస్సులలో కూడా వారికి కూర్చోవడానికి సీట్లు రిజర్వ్ చేయాలని లోక్ అదాలత్ న్యాయస్థానం ద్వారా రాష్ట్రం మొత్తానికి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. జిల్లా న్యాయ స్థానం లో ఫోన్ నెంబర్:- 15100 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందని దీని ద్వారా విభిన్న ప్రతిభావంతులకు జిల్లా న్యాయ సేవ సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవలు అందుబాటులోకి తీసుకుని వచ్చామని మీ హక్కులకు భంగం కలిగినప్పుడు వీటిని వినియోగించుకోవాలని కోరారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ధైర్యవంతులుగా ఉత్సాహవంతులుగా ఉంటారని తెలిపారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు గ్రామాలాలో చిట్ట చివర ఉన్న విభిన్న ప్రతిభావంతులకు కూడా చేరాలని అప్పుడే ఈ సమావేశానికి సార్థకత ఉంటుందని వారు కన్న కలలు సహకారం కావాలని ఆ విధంగా అందరూ కృషి చేయాలని కోరారు. అప్పుడే వారికి ప్రపంచంపై విశ్వాసం , నమ్మకం పెరుగుతుందని దీని వలన రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులకు చెందిన చట్టం 2016 లో వచ్చినప్పటినుండి అందరికీ పూర్తి అవగాహన వచ్చిందని ప్రభుత్వము నుండి రావలసిన అన్ని సహాయ సహకారాలు పొందుతూ ఉన్నారని , ప్రభుత్వము తరపున కార్యాలయాల్లో ర్యాంపులు , టాయిలెట్లు , వెయిటింగ్ రూమ్స్ మొదలగునవి ఏర్పాటు చేయడం జరుగుతుందని , ఉద్యోగాలలో రిజర్వేషన్ ఉన్నదని , ప్రభుత్వ మరియు ప్రైవేటు కళాశాలలో వీరికి కావలసిన నైపుణ్యంతో కూడిన విద్య అందుబాటులో ఉన్నదని, గతం కంటే ఇప్పుడు అక్షరాస్యత బాగా మెరుగుపడిందని , అన్ని రంగాల్లో బాగా రాణిస్తున్నారని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. స్వాగత ఉపన్యాసంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఫాతిమా రయిస్ మాట్లాడుతూ జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు ఇస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. పట్టణ విభిన్న ప్రతిభావంతులకు మెప్మా ద్వారా 3 కోట్ల 80 లక్షల 30 వేల రూపాయల పీఎం స్వానిధి చెక్కును అందజేశారు. విభిన్న ప్రతిభావంతులు టీచర్ బాబురావు తన గాత్రంతో ఆహుతులను అలరించారు. విభిన్న ప్రతిభావంతుల నాయకులు రాఘవయ్య , బాబురావు , అనిల్ కుమార్ , రాధా మనోహరి , రాజామణి , ఎల్లప్ప , వీరేష్ , డాక్టర్ గ్రేస్ సెలెస్టియల్ , భార్గవ్ చౌదరి , సాదిక్ భాషా మొదలగువారు పాల్గొని వారి సమస్యలను ప్రస్తావిస్తూ ప్రసంగించారు.చివరగా విభిన్న ప్రతిభావంతుల నాయకులకు వారి సేవలను కొనియాడుతూ సన్మానము చేశారు.

## క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని మండల విద్యాశాఖ అధికారులు రాందాస్ నాయక్, శార్వాణి స్పష్టం చేశారు.

మార్కాపురం డిసెంబర్ 3 శ్రీ చక్రమార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో దీక్ష యూత్ సర్వీస్ ఆర్గనైజేషన్,మరియు మై భారత్ కోఆర్డినేటర్ సాయి సుబ్బారావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రీడా పోటీలకు వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. క్రీడా పోటీల్లో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు వాలీబాల్, రన్నింగ్ ,షార్ట్ పుట్ , ఖో ఖో పోటీలను నిర్వాహకులు నిర్వహించారు. ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్ ,మెడల్స్, కప్పులను ఎంఈఓ శార్వాణి చేతుల మీదగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామీణ స్థాయిలో కళాశాల మరియు పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహిస్తూ ప్రోత్సహిస్తున్న దీక్ష సమస్త మరియు మై భారత్ ప్రతినిధులను అభినందించారు. ఈ క్రీడా పోటీలలో పాల్గొనడం ద్వారా శారీరిక దృఢత్వంతో పాటు నైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రీడాకారులకు మంచి వేదిక అని ముఖ్య అతిథులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి వేదికనిస్తూ సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి గారికి ఉపాధ్యాయులకి సంస్థ ప్రతినిధులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బాలురు మరియు బాలికల పాఠశాల పీడీలు జాహ్నవి, శ్యామల, దామోదర్, జి ఎల్ రమేష్ బాబు పలువురు , పీ ఈ టీ లు పాల్గొన్నారు

## బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ డా.ఎ. సిరి





కర్నూలు, డిసెంబర్ 03 (శ్రీచక్ర): బుధవారం బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డా.ఎ. సిరి సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఐ. రాఘవేంద్ర చౌదరి కృషి విజ్ఞాన కేంద్రం చేపడుతున్న పరిశోధనలు, రైతుల కోసం అమలు చేస్తున్న సాంకేతిక శిక్షణ కార్యక్రమాలు, ప్రదర్శనల ఫలితాలు మరియు జిల్లా వ్యవసాయ అభివృద్ధికి కేవీకే చేస్తున్న కృషిని వివరిస్తూ సవివరంగా ప్రెజెంటేషన్ ఇచ్చారు. అనంతరం కలెక్టర్ శాస్త్రవేత్తలతో చర్చించి, పంటలలో కొత్త సాంకేతికతలు, వాతావరణ మార్పులు?పంట నిర్వహణ, నీటి సంరక్షణ, పోషక నిర్వహణ, పురుగుల సమగ్ర నిర్వహణ వంటి ముఖ్య అంశాలపై జిల్లాకు అనువైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించే దిశగా సూచనలు చేశారు. రైతులకు ప్రత్యక్ష లాభం చేకూరే విధంగా ప్రాంగణ ప్రదర్శనలు, ఫీల్డ్ విజిట్లు, డిజిటల్ ఎక్స్టెన్షన్ సేవలను మరింత విస్తరించాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వ్యవసాయ?తోటల రంగ సామర్థ్యాన్ని పెంచడానికి కేవీకే, వ్యవసాయ శాఖ, తోటల శాఖ మరియు మైదాన స్థాయి అధికారులతో సమన్వయం పెంచాలని వెల్లడించారు. కేవీకే తీసుకుంటున్న నవీన కార్యక్రమాలను అభినందిస్తూ, భవిష్యత్‌లో మరింత ప్రభావవంతమైన సాంకేతిక సేవలు అందించాలన్నారు. ఈ సందర్భనలో సమన్వయకర్త డాక్టర్ కే. రాఘవేంద్ర చౌదరి, ంఆం మొహమ్మద్ ఖాద్రి, యెమ్మిగనూరు యా శివశంకర్ గారు, ఉద్యానవన శాఖ అధికారి బి. శ్రీ వాణి మరియు కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## రైతన్న మీకోసం వర్క్ షాప్ లో పాల్గొన్న కోలంక రైతులు.కోలంక పిఎసిఎస్ నందు వర్క్ షాపు నిర్వహణ.

కాజులూరు, డిసెంబర్ 3( శ్రీచక్ర) రైతన్న మీకోసం వర్క్ షాప్ లో భాగంగా కోలంక పిఎసిఎస్ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు పాల్గొని స్థానిక రైతులతో పాటు వీక్షించారు. ఈ మేరకు బుధవారం కాజు లూరు మండలం కోలంక పిఎసిఎస్ లో ఈ కార్యక్రమం నిర్వహించారు.అనంతరం సొసైటీ చైర్ పర్సన్ నరసింహనాయుడు రైతులతో మాట్లాడుతూ రైతులు ఏ పంటలు పండిస్తే ఈ ఏరియాలో లాభదాయకంగా ఉంటాయో , పంటలు పెంపునకు కావలసిన ప్రోత్సాహకాలు రైతులకు కావాల్సిన వ్యవసాయ పరికరాలు అలాగే ఎరువులు తగ్గించడం వంటి విషయాలను ఈ సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ అధ్యక్షుడు బుచ్చిబాబు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న,జనసేన నాయకులు బొండా దొరబాబు,రైతులు నెల్లూరి నాగేశ్వరరావు,అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రసన్న,కోలంక వెటర్న డాక్టర్ రామకోటేశ్వ రావు తదితర గ్రామ రైతుల పాల్గొన్నారు.



## విద్యార్థులే ఉపాధ్యాయులు..తల్లి తండ్రులు అయిన వేళ విజయవంతం అయిన మాక్ మెగా పేరెంట్ టీచర్స్ ఆత్మీయ సమావేశం.






మార్కాపురం డిసెంబర్ 3 శ్రీ చక్రమార్కాపురంప్రకాశంజిల్లాకలెక్టర్,విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు జిల్లాలో అత్యధిక విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో కేవలం ఆరు పాఠశాలల్లో మాక్ మెగా పేరెంట్టీచర్స్మీటింగ్నిర్వహించమని కోరారని, అందులో మన పాఠశాల ఉండడం మనకు గర్వ కారణం అని, అందులో భాగంగా కేవలం విద్యార్థులే ఉపాధ్యాయులుగా, అధికారులుగా,విద్యార్థులతల్లిదండ్రులుగా వివిధ పాత్రలను పోషిస్తూ మాక్ మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం నిర్వహించడం జరిగిందని బాలుర ఉన్నత పాఠశాల మార్కాపురం ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్ర శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంద్వారావిద్యార్థులలో నాయకత్వలక్షణాలనుపెంపొందించడానికి, వారికి బోధనా రంగంలో అనుభవాన్ని అందించడానికి, విషయ పరిజ్ఞానాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడానికి, వారిలో దాగి ఉన్న సృజనాత్మకత వెలికి తీసేందుకు మరియు వారి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు వారి భవిష్యత్తు గురించి ఎంత ఆలోచిస్తారో స్వయంగా తెలుసుకునే అవకాశం ఏర్పడి కష్టపడి చదివి మంచి పౌరులుగా రాణిస్తారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థులు ప్రముఖ పాత్ర వహిస్తూ ప్రధానోపాధ్యాయులుగా లోహిత్ , కలెక్టర్ గా అబ్దుల్ కరీం, స్థానిక శాసన సభ్యులుగా కార్తీక్, మార్కాపురం సబ్ కలెక్టర్ గా నరసింహ...మరియుతొమ్మిది,పదవ తరగతి చదివే విద్యార్థులు ఉపాధ్యాయులుగా, తల్లిదండ్రులుగా పాల్గొని కార్యక్రమాన్ని ఎంతో ఆహ్లాదంగా, ఆనందంగా మరియు ఉత్సాహ భరిత వాతావరణంలో విజయవంతంచేసారు..ఈకార్యక్రమంలోఉపాధ్యాయులు..సిబ్బంది.. విద్యార్థులు పాల్గొన్నారు.

## పత్తి రైతులను వెనక్కి పంపించవద్దు:జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి





కర్నూలు, డిసెంబర్ 03 (శ్రీచక్ర): పత్తి లో తేమ శాతం సీసీఐ వారు కొనుగోలు చేసే దాని కంటే ఎక్కువ శాతం ఉన్నట్లయితే రైతులను వెనక్కి పంపించకుండా మిల్లుల ద్వారా కొనుగోలు చేయించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి మార్కెటింగ్ ఏడి ని ఆదేశించారు. బుధవారం ఆదోని లో బత్తిన అభిరామ్, లక్ష్మి చెన్నకేశవ జిన్నింగ్ ఉ ప్రెస్సింగ్ యూనిట్ లలో సీసీఐ ద్వారా జరుగుతున్న పత్తి కొనుగోలు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ ఏ మండలం నుండి వచ్చారు, తీసుకొచ్చిన పత్తిని సిసిఐ వారు కొనుగోలు చేశారా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కలెక్టర్ రైతులను ఆరా తీశారు? తాము తీసుకొచ్చిన పత్తిని తేమ శాతం ఆధారంగా సీసీఐ వారు కొనుగోలు చేస్తున్నారన్నారు.. కొంచెం రంగు మారినట్లయితే కొనుగోలు చేయడం లేదని, స్లాట్ బుకింగ్ లో సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు కలెక్టర్ కి వివరించారు... స్లాట్ బుకింగ్ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లడం జరిగిందన్నారు.. స్లాట్ బుకింగ్ చేసే సమయంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది సాయం చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు... పత్తిని తీసుకొని వచ్చే సమయంలో బాగా ఆరబెట్టి , పొట్టు తీసుకొని రావాలని కలెక్టర్ రైతులకు సూచించారు... వచ్చే సారి పత్తి పంట వేసినట్లయితే, ఇప్పటి లాగా పత్తి పంట ఒకటే వేసి వాటి మీద ఆధారపడకుండా, పత్తి పంట మధ్యలో కంది పంట వేయాలని కలెక్టర్ రైతులకు సూచించారు...పత్తి కొనుగోలు కేంద్రాలలో తూకం యంత్రాలలో సాంకేతిక లోపాలు లేకుండా చూడాలన్నారు... ×తూకపు యంత్రాలు, మాయిశ్చరైజర్ మెషిన్ ను స్వయంగా పరిశీలించిన కలెక్టర్పత్తి కొనుగోలు ప్రక్రియలో భాగంగా తూకం యంత్రాలు ఏ విధంగా పని చేస్తున్నాయని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.. అనంతరం పత్తి తేమ శాతం ఎంత ఉందని కలెక్టర్ మాయిశ్చరైజర్ మెషిన్ ద్వారా స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో ఆదోని ఇంచార్జ్ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, మార్కెటింగ్ ఏడి నారాయణమూర్తి, వ్యవసాయ శాఖ అధికారి బాలవర్ధి రాజు, ఆదోని తహసిల్దార్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నీట మునిగిన లక్షలు విలువ చేసే బియ్యం లబోదిబోమంటున్న హరిహర రైస్ మిల్లు యాజమాన్యం



కోట డిసెంబర్ 3 (శ్రీ చక్ర): కోట మండలం క్రాస్ రోడ్డు లో ఉన్న శ్రీ హరిహర రైస్ మిల్లు దిత్వా తుఫాను నేపథ్యంలో వచ్చిన వర్షాలు తో హరిహర రైస్ మిల్లు నీటమనగింది.కోట, వాకాడు,చిట్టమూరు మండలాల రైతుల కష్టం నీటి పాలైంది.ఈ సందర్బంగా లక్షల రూపాయలు విలువ చేసే బియ్యం పూర్తిగా తడిసిపోయాయి.రైతులు నన్ను నమ్మి ధాన్యం మిల్లుకు తరలించారని విడతల వారీగా రైతులకు నగదు చెల్లించడం జరుగుతుందని ఈ నీటి పాలైన బియ్యాన్ని ఎవరు కొంటారు నేను రైతులకు ఏం సమాధానం చెప్పాలి అని యజమాని గంధం. శ్రీనివాసులు ఆందోళన వ్యక్తం చేశారు.మండల పరిధిలోని రైతులు వేసిన ధాన్యాన్ని గిట్టుబాటు ధర లేని కారణంగా మిల్లులికి తరలించి గిట్టుబాటు ధర వచ్చినప్పుడు వాటిని అమ్ముకునే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా దిత్వా తుఫాన్ కారణంగా ఇటీవల మూడు రోజులు వరుసగా వర్షాలు కురుస్తున్నాయి.గత రాత్రి కుండపోత వర్షం పడటంతో మిల్లుకు తాళం వేసి యాజమాన్యం ఇంటికి వెళ్లారు.అయితే ఒక్కసారిగా అర్ధరాత్రి కుండపోత వర్షంతో వర్షపు నీరు భారీగా మిల్లులో చేరి బియ్యం తడిసిపోయాయి.ఉదయాన్నే యాజమాన్యం వచ్చి చూసి అవాక్కయ్యారు.రైతులకు నేను ఏమి సమాధానం చెప్పాలని దిక్కుతోచని స్థితిలో లబోదిబోమన్నారు.వెంటనే జెసిబి ని పిలిచి పెద్ద గాడిత్రవ్వి మిల్లులోని నీటిని బయటికి తొలగించారు.ప్రభుత్వం స్పందించి రైతుల కష్టానికి ప్రతిఫలం అందించి ఆదుకోవాలని శ్రీ హరి హర రైస్ మిల్లు యజమాని గంధం శ్రీనివాసులు కోరుతున్నారు.

## ఘనంగా జనసేన పార్టీ వీర మహిళ మిరియాల వాసవి ప్రియ జన్మదిన వేడుకలు




మార్కాపురం డిసెంబర్ 3 శ్రీ చక్ర మార్కాపురం జనసేన పార్టీ కార్యాలయం నందు మిరియాల వాసుప్రియ పుట్టినరోజుసందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినిండునూరేళ్లు.ఆయురారోగ్యాలతోఉండాలనిజనసేన .మార్కాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ ఇమ్మడి కాశీనాథ్ అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిరిగిరి శ్రీనివాసరావు, విజయరావు నరసింహారావు, ఉమ్మడి రవీంద్రనాథ్, కంభం వెంకట రమణ రావు, బొందిలి శివ సింగ్, సిరిగిరి అనిత, అఖిల తదితరులు పాల్గొని వాసుప్రియకు శుభాకాంక్షలు తెలియజేశారు

## దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తా



రామచంద్రపురం, డిసెంబర్ 3( శ్రీచక్ర)దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తాన ని, వారికోసం త్వరలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కూడా సహకరిస్తానని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రామచంద్రపురంలో ప్రముఖ న్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి వాసంశెట్టి సత్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగుల్లో అపారమైన శక్తి సామర్థ్యం, ఆత్మస్థైర్యం ఉంటుందని వాటిని ఎప్పుడూ కాపాడుకోవాలన్నారు. అవకాశాలు ఇస్తే ప్రతి ఒక్కరు అద్భుతాలు సృష్టించగలరని, దివ్యాంగులు పలుమార్లు నిరూపించారన్నారు. దివ్యాంగుల పట్ల సమాజం సానుకూలంగా ఉండి ప్రోత్సహించాలి అన్నారు. దివ్యాంగులు సైతం అన్ని రంగాల్లో తమ ప్రతిభ కనబరుస్తూ రాణిస్తున్నారన్నారు. త్వరలోనే రామచంద్రపురంలో దివ్యాంగులకు కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సుభాష్ ద్వారా సహకరిస్తానని హామీ ఇచ్చారు. ప్రముఖన్యాయవాది దొమ్మలపాటి సత్యనారాయణ, మాగాపు అమ్మిరాజు, వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాపూజి, తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, ప్రజాసేన అధ్యక్షులు కాటే సుబ్రహ్మణ్యం, కంచుమర్తి బాబురావు తదితరులు మాట్లాడుతూ సమానత్వం, ఆదరణ ప్రతి దివ్యాంగునికి అందాల్సిన అవసరం ఉందన్నారు. అవకాశాలు కల్పిస్తే దివ్యాంగుల కూడా వారి జీవితాలను అద్భుతంగా తీర్చిదిద్దుతారన్నారు.వారికి కావాల్సింది దయ కాదని, గౌరవం సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పలివెల రాజు తదితరులు పాల్గొన్నారు.

## మోడరన్ పూర్వ విద్యార్థి కళ్యాణ్ పడాలకు మద్దతుగా నిలవండి .మోడరన్ అధినేత జి. వి. రావు

రామచంద్రపురం, డిసెంబర్ 3( శ్రీచక్ర) బిగ్ బాస్ తొమ్మిదో సీజన్ నందు తన ఆటతీరుతో మాటతీరుతో అందరినీ ఆకట్టుకుంటున్న మోడరన్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థి పడాల పవన్ కళ్యాణ్ కి అందరూ మద్దతుగా నిలిచి కళ్యాణ్ పడాల బిగ్ బాస్ విన్నర్ గా నిలిచేందుకు తోడ్పడాలని మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి. వి. రావు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బుధవారం మోడరన్ విద్యాసంస్థల ప్రాంగణంలో బ్యానర్ ను జి.వి.రావు విద్యార్థుల స్టాఫ్ సమక్షంలో ఆవిష్కరించారు. అనంతరం జివి రావు మాట్లాడుతూ... విజయనగరానికి చెందిన పవన్ కళ్యాణ్ ఎన్టీఆర్ ట్రస్ట్ సౌజన్యంతో మోడరన్ విద్యాసంస్థల హాస్టల్ విద్యార్థిగా ఐదు నుండి పదవ తరగతి వరకు తమ సంస్థలో చదువుకున్నాడని తెలియజేశారు. అగ్ని పరీక్ష ఎపిసోడ్ తర్వాత మోడరన్ విద్యాసంస్థలకు వచ్చి తనను కలిసిన విషయాన్ని రావు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కళ్యాణ్ పడాల అనేకమంది అభిమానులను సంపాదించుకోవడం సంతోషంగా ఉందన్నారు. హాస్టల్ విద్యార్థిగా ఉన్న సమయంలో కూడా పవన్ కళ్యాణ్ మోడ్రన్ విద్యాసంస్థల వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవాడని పేర్కొన్నారు.888 6650 455 నెంబర్ కి మిస్ కాల్ ఇవ్వడం ద్వారా, అలాగే జియో హాట్ స్టార్ లో కళ్యాణ్ పడాలకు మద్దతుగా ఓటు వేయాలని రావు కోరారు.బిగ్ బాస్ కార్యక్రమం అనంతరం కళ్యాణ్ పడాల త్వరలో మోడరన్ విద్యాసంస్థలకు రానున్నట్లు ఈ సందర్భంగా జి.వి. రావు తెలియజేశారు. ఇంటర్ అకడమిక్ అడ్వైజర్ సి. హెచ్. శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.



## కోదండరామిరెడ్డి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి




కల్లూరు, డిశంబర్ 3 (శ్రీచక్ర): వైఎస్ఆర్సిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, కాటసాని రాంభూపాల్ రెడ్డి కుటుంబానికి అత్యంత ఆప్తులు కోదండరామిరెడ్డి తిరుపతి)లో గుండెపోటుతో మరణించారు. ఈ విషయం తెలు సుకున్న యువనేత కాటసాని శివ నరసింహారెడ్డి కోదండ రామిరెడ్డి పార్థివ దేహానికి నివాళు లర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

## ఐ టి ఐ విద్యార్థులకు త్రాగునీడి కష్టాలు తీర్చిన జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ డీప్ బోర్ ఏర్పాటు ఆనందం వ్యక్తం చేసిన ఐ.టి.ఐ విద్యార్థులు



మార్కాపురం డిసెంబర్ 3 శ్రీ చక్ర మార్కాపురం ఐటిఐ కాలేజీలో త్రాగునీటి సమస్య పరిష్కారానికి జీజస్ లవ్స్ మినిస్ట్రీస్ ఉదారంతో బుధవారం డీప్ బోర్ వేయడం జరిగింది. మార్కాపురం ఐటిఐ కాలేజీలో విద్యార్థులు త్రాగునీటి సమస్యతో బాధపడుతున్న విషయాన్ని ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపాల్ బి.వాసుబాబుతో పాటు కళాశాల స్టాఫ్ జీజస్ లవ్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ రెవరెండ్ డాక్టర్ గుర్రం శేఖర్ దృష్టికి తీసుకొని రావడంతో, త్రాగునీటి సమస్య ఆవశ్యకత తెలిసిన జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గుర్రం శేఖర్ నీటి సమస్యను వెంటనేపరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కళాశాలలో విద్యార్థులత్రాగునీటిసమస్యనువెంటనేపరిష్కరించాలని భావించిన జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గుర్రం శేఖర్ బోరు బండిని తీసుకొని వచ్చి ఐటిఐ కళాశాలలో డీప్ బోర్ వేయించడం జరిగింది. మొదట ఐటిఐ ప్రిన్సిపల్ బి.వాసు బాబు బోరు బండిని ప్రారంభించారు. అనంతరం డిప్ బోర్ ద్వారా సమృద్ధిగా నీరు రావడంతో జీసస్ లవ్మినిస్ట్రీస్యాజమాన్యం,కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. డీప్ బోరుకు కావలసిన మోటారు, ప్యానెల్ బోర్డు, పైపులు వెంటనే బిగిస్తామని జీసస్ లవ్స్ మినిస్ట్రీస్ ట్రెజరర్ శ్రీమతి సునీత రూత్ బెన్ని తెలిపారు. కళాశాలలో నెలకొన్న త్రాగునీటి సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరుతూ అడిగిన వెంటనే తమ సమస్యను కాదనక కళాశాలలో డీప్ బోరు వేసిన జీజస్ లవ్స్ మినిస్ట్రీస్ డైరెక్టర్ గుర్రం శేఖర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలేజీ స్టాఫ్, విద్యార్థులు, జీసస్ లవ్స్ మినిస్ట్రీస్కో-ఆర్డినేటర్ఎం.ఎస.విజయ్ కుమార్, సూపర్ వైజర్స్ దిలీప్ కుమార్, ఓబులేసు, వెంకటస్వామి, ఆఫీస్ స్టాఫ్ దివ్య జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా ప్రపంచ బ్లైండ్ క్రికెట్ కప్పు సాధించిన జట్టులోని ఆదివాసి బిడ్డ అరుణ కుమారికి ఆర్థిక సహాయం



పోలవరం డిసెంబర్ 3 ( శ్రీ చక్ర) అందుల ప్రపంచ మహిళ క్రికెట్ జట్టు కప్పు సాధించడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆదివాసీ ముద్దుబిడ్డ కరుణ కుమారి కు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసి జగదీశ్వరి 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేయ



డం తో పాటు సాలు వాతో సన్మా నిం చారు. అందుల క్రికెట్ కప్పు సాధించడంలో కీలక పాత్ర పోషించిన నందుకు ప్రత్యేక అభినందనలు తెలుపుతూ ఇంకా పై స్థాయికి వెళ్లాలని కృషి చేయాలని కోరారు

# మారని పాకిస్తాన్ వక్రబుద్ధి

## వరద బాధితులకు ఎక్స్పైర్ ఫుడ్

లాహోర్, డిసెంబర్ 3, పాకిస్థాన్ చిల్లర పనులకు అంతేలేకుండా పోతుంది. భారతదేశంపై నిత్యం అసత్యాలతో కూడిన వ్యాఖ్యలు చేసే పాకిస్థాన్.. తమ దేశంలో పరిస్థితులు దిగజారుతున్నా సరిచేసుకొనే ప్రయత్నం చేయడం చేయడం లేదు. పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతున్నా.. ఉగ్రవాదులను పెంచిపోషిస్తూ భారతదేశంపై దాడులకు ప్రయత్నాలు చేస్తూనే ఉంది. అయితే, తాజాగా.. పాకిస్థాన్ తనకు అలవాటుగా మారిన చిల్లర పనులతో ప్రపంచ దేశాల ముందు పరువు పోగొట్టుకుంది.దిత్వా తుపాను ఇటీవల శ్రీలంకలో విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ తుపాను కారణంగా ఆ దేశం అతలాకుతలమైంది. భారీ వర్షాల కారణంగా 350మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు.. వేల సంఖ్యలో నిరాశ్రయులయ్యారు. దాదాపు 11.18లక్షల మందిపై విపత్తు ప్రభావం పడిందని శ్రీలంక పేర్కొంది. దిత్వాతో భారీ నష్టపోయిన శ్రీలంకను ఆదుకునేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. భారతదేశం కూడా శ్రీలంకకు అండగా నిలిచింది.శ్రీలంకలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో భారత ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ముమ్మరంగా సహాయక చర్యల్లో పాల్గొంటున్నాయి. ఆపదలో ఉన్నవారిని రక్షిస్తున్నాయి. ఆపరేషన్ సాగర్ బంధు పేరిట శ్రీలంకలో భారత్ సహాయక చర్యలు నిర్వహిస్తోంది. అంతేకాక.. తమ వంతుగా ఆహారం, వైద్య సామగ్రి, అత్యవసర సదుపాయాలను శ్రీలంకకు అందిస్తోంది.దిత్వా తుపాను ప్రభావంతో వణుకుతున్న శ్రీలంక కు భారత్ తో పాటు పాకిస్థాన్ సాయం అందించింది. అయితే, పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని చాటుకుంది. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాల్సింది పోయి.. వారికి గడువు ముగిసిన వస్తువులను సాయంగా పంపించిందనే వార్తలు వస్తున్నాయి. వీటికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శ్రీలంక అధికారులు కూడా ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.పాకిస్థాన్ హైకమిషన్ సోషల్ మీడియాలో స్వయంగా పంచుకున్న కొలంబోకు వెళ్లే సహాయ ప్యాకేజీలపై గడువు తేదీ ఇప్పటికే ముగిసినట్లుగా ఉంది. దీంతో పాకిస్థాన్ తీరుపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీలంకకు సాయంగా ఆహారం, ఔషధాలను పాకిస్థాన్ పంపించింది. ఇవి కొలంబోకు చేరుకున్న విషయాన్ని తెలయజేస్తూ శ్రీలంకకు పాకిస్థాన్ ఇప్పుడు ఎప్పుడూ అండగా ఉంటుంది అని ముద్రించిన ప్యాకెట్లను శ్రీలంకలోని పాకిస్థాన్ హై కమిషన్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది.ఆ ప్యాకెట్లపై గడువు తేదీ 2024 అక్టోబర్ లోనే ముగిసినట్లు తెలిసింది. వీటిని గమనించిన శ్రీలంక అధికారులు.. ఈ విషయాన్ని పాకిస్థాన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. పాకిస్థాన్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. పాకిస్థాన్ పొరుగుదేశాలకు అందించే సహాయంలోనూ చిల్లర పనులకు పాల్పడటంతో ప్రపంచ దేశాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# మాట నెగ్గించుకున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

నల్గొండ, డిసెంబర్ 2, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మద్యం షాపుల నిర్వహణపై తనదైన శైలిలో కొన్ని షరతులు విధించిన సంగతి తెలిసిందే. ఊరి చివరనే మద్యం షాపులు, మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే అమ్మకాలు, పర్మిట్ రూములకు సాయంత్రం 6 గంటల తర్వాతే అనుమతి వంటి సూచనలు చేశారు. తాజాగా మద్యం దుకాణాలు గెలుచుకున్న షాపు యజమానులు.. ఇప్పుడు వాటిని అమలు చేస్తున్నారు. దీంతో స్థానికులు ఎమ్మెల్యే మాట నెగ్గిందని చర్చించుకుంటున్నారు. అన్ని చోట్లా ఇలానే ఉంటే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. నిత్యం ఏదో ఒక అంశం మీద



స్పందిస్తూ వార్తల్లో నిలుస్తుంటారు. ఈక్రమంలో గతంలో మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. వైన్ షాపులు దక్కించుకున్న వారు.. గ్రామానికి చివర మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని.. అలానే ఉదయం నుంచే వైన్స్ తెరవద్దని.. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం అమ్మకాలు ప్రారంభించాలని సూచించారు. దీనితో పాటుగా.. అసలు పర్మిట్ రూములకు అనుమతి ఇవ్వొద్దని.. ఒకవేళ ఇవ్వాల్సి వస్తే.. సాయంత్రం ఆరు గంటల తర్వాతే వాటిల్లోకి అనుమతివ్వాలని సూచించిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో పెద్ద గందరగోళమే చెలరేగింది. కానీ ఈ అంశంలో రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారు. మద్యం షాపుల నిర్వహణలో ఆయన సూచనలు అమలు చేస్తున్నారు దుకాణాదారులుమునుగోడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలు దక్కించుకున్న వైన్స్ యజమానులు.. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచన మేరకు ఊరి బయటే మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. అలానే ప్రతి రోజు మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే మద్యం విక్రయాలు మొదలుపెడుతున్నారు. సాయంత్రం 6 గంటలకు పర్మిట్‌రూంలోకి అనుమతి ఇస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తన మాట నెగ్గించుకున్నారని కామెంట్ చేస్తున్నారు స్థానికులు. అన్ని గ్రామాల్లో ఇదే అనుసరిస్తే.. చాలా బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునే సమయంలోనే ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. మునుగోడు నియోజకవర్గంలోని మద్యం దుకాణాల యజమానులతో కీలక భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మద్యం షాపు ఓనర్స్‌కు కీలక సూచనలు చేశారు. బెల్ట్ షాపులు నిర్వహించొద్దని, సిండికేట్ ఏర్పడకూడదని.. ఊరి చివరే మద్యం అమ్మకాలు జరపాలని.. అలానే పర్మిట్‌రూంలకు పర్మిషన్ ఇవ్వొద్దని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి వారికి సూచించిన సంగతి తెలిసిందే.అనంతరం మద్యం దుకాణాలు దక్కించుకున్న యజమానులతో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. హైదరాబాద్‌లోని తన నివాసంలో ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఆయన పెట్టిన కండీషన్లకు మద్యం దుకాణాదారులు, వ్యాపారులు ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఊరి బయటే మద్యం షాపులను ఏర్పాటు చేయగా.. తాజాగా సోమవారం వాటిని ప్రారంభించారు. అలానే ఎమ్మెల్యే సూచించనట్లుగానే మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతనే మద్యం విక్రయాలు ప్రారంభించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తొలి విడత ఏకగ్రీవాలు లెక్క తేలింది

## వికారాబాదలో 16.. జగిత్యాలలో ఒకటి

హైదరాబాద్, డిసెంబర్ 3 తొవిడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వ ముగిసింది. ఈక్రమంలో తొలి విడతలోని మొత్తం పంచాయతీల్లో 5 సర్పంచి, 133 వార్డు స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. అలానే 129 సర్పంచి స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. ఏకగ్రీవాల్లో ఆదిలాబాద్ అత్యధికంగా 30 సర్పంచ్ స్థానాలతో ప్రథమ స్థానంలో ఉంది. ఇదిలా ఉంటే తొలి విడతలో భాగంగా 133 వార్డులకు నామినేషన్ దాఖలు కాలేదు. ఇక మిగిలిన 37,179 వార్డులకు 85,428 మంది నామినేషన్లు వేశారు. తొలి విడత నామినేషన్ల పరిశీలన పూర్తయిందితెలంగాణ పంచాయతీ ఎన్నికల హాడావుడి మొదలైంది. ఈక్రమంలో తొలి విడత పంచాయతీలకు సంబంధించి నామినేషన్ల పర్వం ముగిసింది. ఇక తొలి విడతలో భాగంగా 4,236 పంచాయతీలకు, 37, 179 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించి నామినేషన్ల పర్వ ముగిసింది. ఈ క్రమంలో తొలి విడతలో భాగంగా 5 పంచాయతీలకు, 133 వార్డులకు ఎన్నికలు జరిగే అవకాశం లేదని తెలుస్తోంది. కారణం ఇక్కడ నామినేషన్లు వేయలేదు.తొలి విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక వివరాలు వెల్లడించింది. తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 5 సర్పంచ్ స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని ఎస్ఈసీ తెలిపింది. అలాగే 133 వార్డుల్లోనూ పోటీకి ఎవరూ ముందుకు రాలేదని.. ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 37, 440 వార్డులకు గాను 133 మినహా మిగతా 37,179 స్థానాలకు.. 85,428 మంది నామినేషన్లు వేశారు.తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 4,236 పంచాయతీల్లో.. 5 మినహా మిగతా 4,231 సర్పంచ్ స్థానాలకు గాను 22,330 మంది నామినేషన్లు వేశారు. ఇదిలా ఉంటే.. 129 సర్పంచ్ స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్లు వేయడంతో అవి ఏకగ్రీవం కానున్నాయి. నామినేషన్ల పరిశీలన పూర్తయిన తర్వాత ఈ వివరాలను ఎన్నికల సంఘం ప్రకటించింది.ఈ నెల 3వ తేదీ వరకు నామినేషన్లు ఉపసంహరించుకోవడానికి గడువు ఉంది. అలానే రెండో విడత ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారంతో ఈ గడువు ముగిసింది. ఇక తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో 129 సర్పంచి స్థానాలకు ఒక్కొక్కరే నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఏకగ్రీవాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు అధికారులు.సర్పంచ్ పదవికి ఒకే ఒక్క నామినేషన్ దాఖలైన పంచాయతీల విషయానికి వస్తే.. ఆదిలాబాద్ జిల్లా అత్యధిక ఏకగ్రీవాలతో ప్రథమ స్థానంలో ఉంది. ఆదిలాబాద్ జిల్లాలో ఏకంగా 30 చోట్ల ఒక్కొక్కరే నామినేషన్లు వేశారు. ఆ తర్వాత స్థానాల్లో వికారాబాద్ (16), నిర్మల్ (9), కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నారాయణపేట, సిద్ధిపేట, నిజామాబాద్ 6 చొప్పున ఉన్నాయి.

# మాటలు వక్రీకరించొద్దు..

## టీ నేతలకు జనసేన స్వీట్ వార్నింగ్

హైదరాబాద్, డిసెంబర్ 3, పల్లె పండుగ 2.0' లో భాగంగా కోనసీమ లోని రాజోలు నియోజకవర్గం లో రీసెంట్ గానే పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కోన సీమ కొబ్బరి చెట్లను చూసి తెలంగాణ జనాలు దిష్టి పెడుతున్నారు, అందుకే అవి ఎండిపోతున్నాయి అంటూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు రేపాయి. ఎక్కడ చూసినా దీని గురించే చర్చ. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలను అవమానించాడని , తక్షణమే ఆయన క్షమాపణలు చెప్పాలని ముందుగా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఇక నేడు తెలంగాణ మంత్రులు ఒక్కొక్కరుగా మీడియా ముందుకొచ్చి పవన్ కళ్యాణ్ పై తీవ్రమైన విమర్శలు చేస్తూ, నీ సినిమాలను తెలంగాణ లో ఆడనివ్వం, మర్యాదగా క్షమాపణలు చెప్పు అంటూ డిమాండ్ చేశారు. సాక్ష్యాత్తు సినిమాటోగ్రఫీ మినిస్టర్ కోమటి రెడ్డి వెంకటరెడ్డి కూడా పవన్ కళ్యాణ్ కి ఇలాంటి వార్నింగ్ ఇచ్చాడు. అయితే పవన్ కళ్యాణ్ దీనిపై స్పందిస్తాడా లేదా? , క్షమాపణలు చెప్తాడా లేదా అని అనుకుంటున్న సమయం లో కాసేపటి క్రితమే సోషల్ మీడియా ద్వారా జనసేన పార్టీ నుండి ఒక ప్రకటన విడుదలైంది. అందులో 'రాజోలు నియోజగవర్గం లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటనలో భాగంగా రైతులతో ముచ్చటిస్తూ మాట్లాడిన మాటలను తెలంగాణ మంత్రులు వక్రీకరిస్తూ మాట్లాడుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మంచి సఖ్యత ఉన్న ఈ సమయం లో వాస్తవ మాటలను వక్రీకరించి విబేధాలు సృష్టించకండి' అంటూ ఆ లేఖ లో చెప్పుకొచ్చాడు. పవన్ కళ్యాణ్ అభిమానులు కూడా అసలు తమ అభిమాన నాయకుడు ఏమి మాట్లాడాడో వీడియో ద్వారా తెలిపే ప్రయత్నం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ తెలంగాణ లోని కొంతమంది నాయకులను ఉద్దేశించి మాట్లాడిన మాటలను, తెలంగాణ ప్రజల గురించి మాట్లాడినట్టుగా వక్రీకరించి చూపించారని, ఇలాంటి నీచమైన రాజకీయాలు ఇకనైనా మానుకోండి అని, తెలంగాణ ప్రభుత్వం పై వ్యతిరేకత వచ్చినప్పుడల్లా జనాల దృష్టిని మరలించేందుకు ఇలాంటి చీప్ ట్రిక్స్ ప్లే చేయడం కాంగ్రెస్ పార్టీ కి వెన్నతో పెట్టిన విద్య అంటూ మండిపడుతున్నారు పవన్ ఫ్యాన్స్. మాటలను వక్రీకరించవద్దు

# కాకతీయ మెగా టెక్స్ టైల్స్ పార్క్ కు కేంద్రం నిధులు

వరంగల్, డిసెంబర్ 2, వరంగల్‌ను రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంలో భాగంగా.. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు కేంద్ర ప్రభుత్వం నిధులను వేగవంతం చేస్తోంది. ఇప్పటికే రూ.30 కోట్లు రాష్ట్రానికి అందజేయగా.. త్వరలో మరో రూ.30 కోట్లు ఇస్తామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. రూ.1,700 కోట్ల పెట్టుబడులు లక్ష్యంగా పెట్టుకున్న ఈ పార్కులో.. ఎవర్ టాప్ టెక్స్ అనే కొరియా కంపెనీ రూ.1,100 కోట్లు పెట్టుబడి పెట్టి 12 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ఈ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా స్థానిక యువతకు.. ముఖ్యంగా మహిళలకు భారీగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తున్న వరంగల్ జిల్లా రూపురేఖలను మార్చే శుభవార్త ఇది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. దేశంలోని అతిపెద్ద మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకటైన ఈ మెగా టెక్స్‌టైల్ పార్కు పనులు వేగవంతం కావడంపై ఓరుగల్లు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కేంద్ర ప్రభుత్వ పీఎం-మిత్ర పథకం కింద ఎంపికైన దేశంలోని 7 మెగా టెక్స్‌టైల్ పార్కుల్లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ఒకటి. ఈ ప్రాజెక్టు పురోగతిపై కేంద్ర మంత్రి సమీక్ష నిర్వహించారు. మొత్తం రూ. 200 కోట్ల వ్యయంతో ఈ మెగా టెక్స్‌టైల్ పార్కు నిర్మాణాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి తొలి విడతగా రూ. 30 కోట్లు అందజేయగా.. త్వరలోనే మరో రూ. 30 కోట్లు కేటాయిస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లాలోని గీసుకొండ మండలం శాయంపేట, సంగెం మండలం చింతపల్లి గ్రామాలలో సుమారు 2 వేల నుండి 3 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ పార్కును ఏర్పాటు చేస్తున్నారు.భూసేకరణ పనులు దాదాపుగా పూర్తయ్యాయని మంత్రి పేర్కొన్నారు. ఈ పార్కు ద్వారా మొత్తం రూ. 1,700 కోట్ల పెట్టుబడులు వస్తాయని.. తద్వారా 12,500 మందికి పైగా స్థానిక యువతకు.. ముఖ్యంగా మహిళలకు ఉపాధి లభిస్తుందని అంచనా. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో విజయం సాధించింది. ఎవర్ టాప్ టెక్స్ అనే దక్షిణ కొరియా కంపెనీ ఈ పార్కులో ఏకంగా రూ. 1,100 కోట్ల మేర భారీ పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం చేసుకుంది.ఈ పెట్టుబడితో 11 వేల మందికి ఉపాధి కల్పిస్తామని కంపెనీ హామీ ఇచ్చింది. ఇది ప్రభుత్వ యాజమాన్యంలోని ప్రాజెక్టు కావడంతో... దీని నిర్మాణాన్ని తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక, మౌలిక సదుపాయాల సంస్థ పర్యవేక్షిస్తుంది. ఈ పార్కులో పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడానికి అన్ని రకాల అత్యాధునిక మౌలిక వసతులను (రోడ్లు, విద్యుత్, నీరు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు) కల్పిస్తున్నారు.యంగ్ వన్ కార్పొరేషన్ కంపెనీ ఇప్పటికే ఈ పార్కులో తన వాణిజ్య ఉత్పత్తిని (2025 అక్టోబర్ నుండి) ప్రారంభించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించి పార్కు భూమిపూజ చేయించాలనే ఉద్దేశంతో ఉన్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ ప్రాజెక్టు వరంగల్ ఆర్థిక దశను పూర్తిగా మార్చనుంది.

# నా బార్డ్ నిధులతో గోదాములు

హైదరాబాద్, డిసెంబర్ 3, తెలంగాణలో మూడేళ్లలో ధాన్యం ఉత్పత్తి మూడు రెట్లు పెరిగినప్పటికీ వాటిని నిల్వ చేసేందుకు అవసరమైన మేరకు గోదాములు లేవు. దీంతో కొత్తగా 26 గోదాములను నిర్మించేందుకు రాష్ట్ర సర్కారు ఏర్పాట్లు చేస్తోంది.వీటిలో 12 గోడౌన్లను ప్రభుత్వ నిధులతో, మరో 14 గోదాములను నాబార్డు నిధులతో నిర్మిస్తుంది. వీటి కోసం రూ.295.68 కోట్లు ఖర్చుచేస్తుంది. 2.91 లక్షల టన్నుల స్టోరేజీతో గోదాముల నిర్మాణం జరగనుంది. వేర్ హౌజింగ్ శాఖ ఆధ్వర్యంలో 12 గోదాములను, 1.51 లక్షల టన్నుల స్టోరేజీ సామర్థ్యంతో నిర్మిస్తారు. నాబార్డు సహకారంతో 14 గోదాములను రూ.140 కోట్ల రుణాలతో 1.40 లక్షల టన్నుల సామర్థ్యంతో ఉండేలా గోడౌన్ల నిర్మాణం చేపట్టారు.పర్యావరణ అనుకూల పంథాలో వీటి నిర్మాణం ఉంటుంది. అందులోని పంటలకు ఎలుకలు, చీడపీడల బెడద లేకుండా చేసేందుకు గాలి వెలుతురు ఉండేలా స్టోరేజ్ వృథాను నివారించేలా నిర్మిస్తారు.కాగా, 2024-25 ఏడాది తెలంగాణలో 190 లక్షల టన్నుల ధాన్యంతో పాటు 30 లక్షల టన్నుల మక్కల దిగుబడి వచ్చింది. అలాగే, 28 లక్షల టన్నుల పత్తితో పాటు 20 లక్షల టన్నుల ఇతర పంటల దిగుబడి వచ్చింది. వాటిని నిల్వచేసుకోవడానికి గోదాములు సరిపోవడం లేదు.రైతులు ప్రతి ఏడాది పంటలను నిల్వచేసుకోవడానికి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు.

# చియా సీడ్స్ తింటున్నారా - అయితే, ఇది తప్పక తెలుసుకోవాల్సిందే..!!



చియా సీడ్స్. ఫైబర్‌తో సహా అనేక పోషకాలతో సమృద్ధిగా ఉండే విత్తనం. ఇందులో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు, కాల్షియం వంటి అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. చియా విత్తనాల వినియోగం ఈ మధ్య కాలంలో బాగా పెరిగింది. అనేక మంది ఆరోగ్య ప్రయోజనాల కోసం చియా విత్తనాలన తీసుకుంటున్నారు. అయితే.. చియా విత్తనాల తో ఎన్ని రకాలుగా మేలు జరుగుతుందో.. అదే సమయంలో తీసుకోవాల్సిన పరిమితి గురించి నిపుణులు హెచ్చరిస్తున్నారు. అసలు చియా ఎంత తీసుకోవాలి... ఏ విధంగా తినాలో సూచనలు చేస్తున్నారు. చియా సీడ్స్ సూపర్‌ఫుడ్ స్టార్‌లా మారాయి. ఈ విత్తనాలను సాల్వియా హిస్పానియా అనే మొక్క నుండి తీసుకుంటారు. వీటిని చాలా మంది రాత్రిపుట నీటిలో నానబెట్టి ఉదయాన్నే తింటారు. కానీ, వీటిని పాలలో నానబెట్టి తింటే రెట్టింపు ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతు న్నారు. నానబెట్టిన తర్వాత తినడం వల్ల జీర్ణ సమస్యలు తగ్గిపోతాయి. చియా గింజలు తిన్న తర్వాత పుష్కలంగా నీరు తాగాలి. ఎందుకంటే ఇది నీటిని గ్రహిస్తుంది. ఇది శరీరంలో నిర్జలీకరణానికి కారణమవుతుంది. మీరు మొదటిసారి చియా విత్తనాలను తింటుంటే తక్కువ పరిమాణంలో తినడం మీ ఆరోగ్యానికి మంచిది. ఒక రోజులో 1 నుండి 2 చెంచాల చియా గింజలు మాత్రమే తీసుకోవాలి. చియా విత్తనాలు చల్లదనాన్ని కలిగి ఉంటాయి. ఇది కడుపుని ఎక్కువసేపు చల్లగా ఉంచుతాయి. అంతేకాకుండా, హైడ్రేషన్ స్థాయిలను నిర్వహించడంలో కూడా ఉపయోగపడతాయి. చియా సీడ్స్ ఫైబర్‌తో సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి ఇది మలబద్ధకం, ఆమ్లత్వం వంటి కడుపు సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. చియా సీడ్స్ గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఇది రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో కూడా సహాయపడుతాయి. ఈ విత్తనాలు డయాబెటిక్ డయాబెటిస్‌ను నియంత్రించడంలో సహాయపడుతాయి . చియా గింజలు కేలరీలు తక్కువగా ఉంటాయి. దీని కారణంగా మనకు త్వరగా ఆకలి వేయదు. అతిగా తినకుండా నిరోధిస్తూ బరువు తగ్గించడంలో సహాయపడతాయి. చియా గింజలు కాల్షియం, మెగ్నీషియం, భాస్వరం వంటి పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి ఇవి ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతాయి. చియా విత్తనాలను పెద్ద మొత్తంలో తినడం వల్ల విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. చియా విత్తనాలంటే అలెర్జీ ఉన్నవారు వీటిని తినకూడదు. ఇక, రక్తపోటు, మధుమేహ రోగులు వైద్యుడిని సంప్రదించకుండా చియా విత్తనాలను తినడం మంచిది కాదు. చియా విత్తనాలను నీటిలో లేదా పాలలో నానబెట్టకుండా తింటే గొంతు సమస్యలు వస్తాయి. బ్లడ్ ప్రెషర్ మందులు వాడేవాళ్లు ఎక్కువ తింటే పొటాషియం లెవెల్ ఒక్కసారిగా పెరిగి హైపర్‌కలీమియా వచ్చే రిస్క్ ఉంటుంది. ఒమేగా-3 ఎక్కువగా ఉండటంతో బ్లడ్ థిన్నర్స్ అయిన వార్ఫరిన్, ఆస్పిరిన్ వాడేవాళ్లకి బ్లీడింగ్ రిస్క్ పెరుగుతుంది. పెద్దలు రోజుకి 1-2 టేబుల్ స్పూన్లు (15-25 గ్రాములు) మాత్రమే తీసుకుంటే మంచిదని నిపుణుల సూచిస్తున్నారు.

# టీని మరిగించి మరిగించి తాగుతున్నారా: దెబ్బైపోతారు బాస్..!!



మనం టీని మళ్లీ వేడి చేసి తాగొచ్చా లేదా అనే సందేహం చాలామందికి ఉంటుంది. ఇది మనందరికీ ఏదో ఒక సమయంలో ఎదురయ్యే ప్రశ్న. చాలామంది టీని వేడిగా తయారు చేసుకున్న తర్వాత, దాన్ని ఎక్కువసేపు అలాగే వదిలేయడం, కొన్నిసార్లు పూర్తిగా మర్చిపోవడం వంటివి చేస్తుంటారు. టీని మళ్లీ వేడి చేస్తే ఏం జరుగుతుంది, ఎందుకు మనం దాన్ని మానుకోవాలి అనేది ఇప్పుడు చూద్దాం. టీని పదే పదే వేడి చేయడం వల్ల దాని రుచి, పోషక విలువలు, సువాసన తగ్గిపోతాయి. టీని నాలుగు గంటలకు పైగా అలాగే వదిలేసినట్లయితే.. దాన్ని మళ్లీ వేడి చేయకపోవడమే మంచిది. ఎందుకంటే- అందులో ఫంగస్, బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. పాలు, హెర్బల్, ఫ్రూటీతో తయారు చేసిన టీని మళ్లీ వేడి చేయడం వల్ల అందులోని అనేక ప్రయోజనకరమైన గుణాలు నశించిపోతాయి. టీలో ఉండే ఎసెన్షియల్ ఆయిల్స్ వంటివి అధిక ఉష్ణోగ్రతలకు గురైనప్పుడు ఆవిరైపోతాయి. టీని ఎప్పుడూ మరిగించకూడదు.. ముఖ్యంగా పాలు, చక్కెర కలిపి ఉన్నప్పుడు. టీ తయారుచేయడానికి ముందుగా నీటిని మరిగించి పొయ్యి మీద నుండి తీసేయాలి. ఆ తర్వాత టీ ఆకులను అందులో 3-4 నిమిషాలు నానబెట్టాలి. ఈ ప్రక్రియనే 'బ్రూయింగ్' అంటారు. ఒకవేళ మీరు టీ ఆకులను నేరుగా నీటిలో మరిగించినట్లయితే- అందులోని పోషకాలు, రుచి, సువాసన చాలావరకు తగ్గిపోతాయి. అదే టీని మళ్లీ మరిగిస్తే ఏం జరుగుతుందో ఊహించుకోండి! టీలో ఫుడ్ పాయిజనింగ్ బ్యాక్టీరియా పెరుగుతుంది. పాలు కలిపిన టీ విషయంలో ఇది మరింత అధికం. పాలు ఉండటం వల్ల బ్యాక్టీరియా వేగంగా పేరుకుపోతుంది. టీని మళ్లీ వేడి చేసినప్పటికీ అవి చనిపోవు. టీలో ఫంగస్ వృద్ధి చెందితే సమస్యలు తీవ్రమవుతాయి. అలాంటి టీని మళ్లీ వేడి చేసి తాగినప్పుడు అవి కడుపు నొప్పి, అతిసారం, తిమ్మిర్లు, వికారం, వాపు, ఇంకా అనేక జీర్ణ సమస్యలకు కారణం కావచ్చు. మళ్లీ వేడి చేయడం వల్ల టీ రుచిపై కూడా ప్రతికూల ప్రభావం పడుతుంది. టీ రంగు, రుచికి టానిన్లు కారణం. టీని ఎక్కువసేపు అలాగే ఉంచినప్పుడు లేదా తర్వాత మళ్లీ వేడి చేసినప్పుడు అది ఆకుల నుండి అదనపు టానిన్లను విడుదల చేయడానికి కారణమవుతుంది. తద్వారా టీ చేదుగా మారుతుంది. స్ట్రాంగ్ టీని తాగడానికి ఇష్టపడని వారికి ఇది రుచించకపోవచ్చు. ఖీవఇనీఎవనిటవట ఈనీతీ జనీబీ "కొంప కొల్లేరు చేసిన ' చల్లారిన టీని మళ్లీ వేడి చేయడం మంచిది కానప్పటికీ- తప్పనిసరి అయినప్పుడు కొన్ని ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. మొదట- చల్లారిన టీని శుభ్రమైన కప్పులో ఉంచాలి. మరొక పాత్రలో నీటిని మరిగించి, ఆ కప్పును మరిగే నీటిలో 3-4 నిమిషాలు ఉంచాలి. దీన్ని 'డబుల్ బాయిలర్' పద్ధతి అంటారు. అలా చేసినప్పుడు కూడా టీ మునుపటి లాగా మళ్లీ తాజాగా ఉంటుందని ఆశించవద్దు.

# ప్రతీరోజూ పరగడుపున రెండు వెల్లుల్లి రెబ్బలు తింటే ఏమవుతుంది?



ఆరోగ్యంగా ఉండాలని భావించేవారు మన వంటింట్లో ఉండే మంచి ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చే పదార్థాలను ప్రతిరోజు మన నిత్యజీవితంలో తీసుకుంటే మేలు చేకూరుతుంది. ఇక మంచి ఆరోగ్యానికి దోహదం చేసే అటువంటి వాటిల్లో వెల్లుల్లి ఒకటి. వెల్లుల్లి శతాబ్దాలుగా మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడానికి జీర్ణక్రియను మెరుగుపరచడానికి, మనకు ఆరోగ్యాన్ని ఇవ్వడానికి సహజ నివారణగా ఉపయోగిస్తారు. వెల్లుల్లితో ఆరోగ్యం .. ఈ ప్రయోజనం అటువంటి వెల్లుల్లిని ప్రతిరోజు ఉదయం ఖాళీ కడుపుతో రెండు రెబ్బలు తింటే మన శరీరంలో కలిగే మార్పులు ఏంటి? ఎందుకు వెల్లుల్లి తీసుకోవడం మంచిది? తెలుసుకుందాం.ప్రతిరోజు ఉదయం ఖాళీ కడుపుతో రెండు వెల్లుల్లి రెబ్బలు తింటే కలిగే ప్రయోజనాల విషయానికి వస్తే ఇది మన శరీరంలో రక్తపోటును తగ్గించడానికి దోహదం చేస్తుంది. వెల్లుల్లి రక్తనాళాలను రిలాక్స్ చేసి, మన బీపీని సహజసిద్ధంగా తగ్గిస్తుంది. పరగడుపున వెల్లుల్లి తింటే చెడు కొలెస్ట్రాల్ కు చెక్ అంతేకాదు మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ ను పెంచే గుణం వెల్లుల్లిలో ఉంటుంది. ఎప్పుడైతే మనం ఉదయం పూట పరగడుపున వెల్లుల్లిని రెండు రెబ్బలు తీసుకుంటామో చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఇది మన గుండె సంబంధిత రిస్క్ రాకుండా కాపాడుతుంది. బ్లాక్స్ ఏర్పడకుండా చేస్తుంది. 5 వెల్లుల్లితో ఈ ఆరోగ్య ప్రయోజనాలు కూడా వెల్లుల్లి ఇన్సులిన్ సెన్సిటివిటీ ని మెరుగుపరిచి, డయాబెటిస్ ను కంట్రోల్ చేస్తుంది . వెల్లుల్లిలో ఉండే అలిసిన్ మన ఇమ్యూనిటీని పెంచుతుంది. జలుబు, ఫ్లూ, ఇన్ఫెక్షన్లను తగ్గించే శక్తి వెల్లుల్లికి ఉంటుంది. వెల్లుల్లి మన శరీర బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది. ఫ్యాట్ బర్నింగ్ యొక్క వేగాన్ని పెంచుతుంది. మన శరీరంలో మెటబాలిజంను పెంచుతుంది. వెల్లుల్లితో జీర్ణక్రియ మెరుగవుతుంది. వెల్లుల్లి ఉదయం తీసుకోవాలంటే జాగ్రత్త ' అజీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. శరీరం డిటాక్సిఫై చేస్తుంది. వెల్లుల్లి కాలేయ సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది. మన కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. అయితే వెల్లుల్లిని పరగడుపున తీసుకోవాలి అనుకుంటే, ఏవైనా అనారోగ్య సమస్యలు ఉన్నవారు వైద్యులను సంప్రదించిన తర్వాత మాత్రమే తీసుకోవాలి. లేదంటే ఇబ్బంది ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది.


# రాత్రివేళ పుల్కాలు తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు

నూనె లేకుండా మంటపై కాల్చేదే పుల్కా. చపాతీ లాగే దీని తయారీలో గోధుమపిండినే వాడతారు. నూనె వాడకపోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారం కోసం చూసే వారికి ఇది ఒక అద్భుతమైన ఎంపిక. నూనె లేకుండా తయారు చేసిన పుల్కాలో కేలరీలు, కొవ్వు తక్కువగా ఉంటాయి. బరువు నియంత్రణకు అనుకూలం. గోధుమల్లో ఉండే కరిగే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. కొలెస్ట్రాల్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. పుల్కా తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ (ఉఎ) కలిగి ఉండటం వల్ల రక్తంలో చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తుంది. రక్తంలో చక్కెర స్థాయి అకస్మాత్తుగా పెరగకుండా నివారిస్తుంది. మధుమేహులకు ప్రయోజనకరం. పుల్కాలు ః1, ః2, ః3, ః6, ః9 వంటి విటమిన్లు, ఐరన్, కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం వంటి ఖనిజాలతో నిండి ఉంటాయి. అవి సంపూర్ణ ఆరోగ్యానికి అవసరం. సంక్లిష్ట కార్బోహైడ్రేట్ల వల్ల పుల్కాలు



రోజంతా స్థిరమైన శక్తిని అందిస్తాయి. కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి.' గోధుమ పిండిలోని జింక్, ఇతర ఖనిజాలు చర్మ ఆరోగ్యానికి తోడ్పడతాయి. మొటిమల నివారణకు, కణాల పునరుత్పత్తికి ఇవి సహాయపడతాయి. ప్రదాయ వంట పద్ధతిలో తయారైన ఈ ఆహారం అనేక ప్రయోజనాలను అందిస్తూ, ఆధునిక ఆరోగ్య అవసరాలను తీరుస్తుంది. దేశంలో- ముఖ్యంగా ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లో పుల్కాలు దైనందిక ఆహారంలో అంతర్భాగం. గోధుమ పిండితో తయారవుతాయి కాబట్టి పుల్కాలు, వీటితో పాటు చపాతీలు ఆరోగ్యకరమైనవి. ఇందులో ఉండే పీచు మలబద్ధకాన్ని నివారిస్తూ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచి, ఎక్కువసేపు కడుపు నిండుగా ఉండేలా చేస్తుంది. అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నందువల్ల పుల్కాలను రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. శక్తిని పెంచడానికి కూడా ఇవి ఉపయోగపడతాయి. పోషకాలు నిండిన పుల్కాలు బరువు తగ్గడంలోనూ కీలక పాత్ర పోషిస్తాయి. గోధుమ ధాన్యంలోని కెర్నల్ నుండి వచ్చే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణకు తోడ్పడుతుంది. 5 పుల్కాల్లో ఉండే పోషకాలు మొటిమలు, మచ్చలను నివారిస్తాయి. వీటి తయారీ కోసం వినియోగించే నాణ్యమైన గోధుమల్లోని ఐరన్.. హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది.

# కొరియన్ గ్లాస్ స్కిన్ కావాలా.. ఇది తెలుసుకోండి!



అందమైన, ఆరోగ్యకరమైన చర్మం కావాలని ఎవరు కోరుకోరు. ప్రతి ఒక్కరూ మన చర్మం అందంగా ఉండాలని అనుకుంటారు. అందమైన చర్మాన్ని సొంతం చేసుకుని మెరుస్తూ ఉండాలని కలలు కంటారు ముఖ్యంగా మహిళలు అయితే కొరియన్ గ్లాస్ స్కిన్ లా మెరిసిపోయే స్కిన్ కావాలని భావిస్తారు. ఇక అటువంటివారు ప్రకాశవంతమైన స్కిన్ కావాలంటే ఏం చేయాలి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. కొరియన్ గ్లాస్ స్కిన్ కావాలంటే జీవన శైలి ముఖ్యం కొరియన్ గ్లాస్ స్కిన్.. ఇది లోపల నుండి ప్రకాశించే స్పష్టమైన మరియు చాలా హైడ్రేటెడ్ గా ఉండే చర్మం. ఇది మన అందాన్ని మరింత పెంచుతుంది. ఇటీవల కాలంలో కొరియన్ గ్లాస్ స్కిన్ కోసం అమ్మాయిలు రకరకాల ప్రయోగాలు చేస్తున్నారు. అయితే కొరియన్ గ్లాస్ స్కిన్ కావాలంటే జీవన శైలి కూడా చాలా ముఖ్యమని బ్యూటీషియన్లు చెబుతున్నారు. ఇలా చేస్తే కొరియన్ గ్లాస్ స్కిన్ అన్నిటికంటే ముందు మంచినీళ్ళను తగినంతగా తాగాలని ఇది మన చర్మాన్ని హైడ్రేటెడ్ గా ఉంచడానికి దోహదం చేస్తుందని చెబుతున్నారు. అంతేకాదు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తున్నారు. పండ్లు, కూరగాయలు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం, చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని, చర్మాన్ని తేమగా ప్రకాశవంతంగా ఉండేలా చేస్తుందని చెబుతున్నారు. బియ్యం పిండితో ఇలా చేస్తే చర్మ నిగారింపు చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే అందంగా మెరిసిపోవాలంటే తగినంత నిద్ర కూడా అవసరమని సూచిస్తున్నారు. ఇక స్కిన్ డీహైడ్రేట్ కాకుండా వారానికి రెండుసార్లు హైడ్రేటింగ్ షీట్ మాస్క్ ను ఉపయోగించడం మీ స్కిన్ కు అదనపు మెరుపు నిస్తుందని చెబుతున్నారు. మనం ఇంట్లోనే ముఖ సౌందర్యాన్ని మెరుగుపరుచుకోవడానికి, కొరియన్ గ్లాస్ స్కిన్ లాంటి లుక్కు పొందడానికి బియ్యం పిండి సహజమైన ఎక్స్ ఫోలియేటర్ గా పనిచేస్తుందని, ఇది మన చర్మానికి కావలసిన నిగారింపును ఇస్తుందని చెబుతున్నారు. బియ్యం పిండి ఫేస్ ప్యాక్ తో కొరియన్ గ్లాస్ స్కిన్ బియ్యం పిండిలో పాలు కానీ పెరుగు కానీ కలిపి దాంతో ఫేస్ ప్యాక్ వేస్తే ఇది చర్మాన్ని కాంతివంతం చేసే మృదువుగా ఉండేలా చేస్తుందని చర్మంపై ఉన్న మచ్చలను తగ్గించే సహజసిద్ధమైన మెరుపును తెస్తాయని చెబుతున్నారు. కాబట్టి కొరియన్ గ్లాస్ స్కిన్ కావాలంటే ముందు ఇంట్లోనే సహజ పద్ధతులను ఫాలో అవ్వండి. బ్యూటీ పార్లర్ల వెంట పరిగెత్తడం మానేయండి.




# గైక్వాడ్, కోహ్లీ సెంచరీలు.. దక్షిణాఫ్రికా ముందు భారీ టార్గెట్..





కింగ్ విరాట్ కోహ్లీ (102) మరోసారి తన విశ్వరూపం ప్రదర్శించాడు. వరుసగా రెండో సెంచరీ సాధించాడు. యువ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్ (105) కూడా తొలి శతకంతో మెరిశాడు. ఈ ఇద్దరు ఆటగాళ్లు చెలరేగడంతో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో టీమిండియా భారీ స్కోరు సాధించింది. రాయ్‌పూర్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు టీమిండియా బ్యాటర్లు చుక్కలు చూపించారు రాంచీలో జరిగిన తొలి వన్డేలో సెంచరీ చేసిన కింగ్ కోహ్లీ తన ఫామ్‌ను కొనసాగించి ఈ రోజు మరో సెంచరీ చేశాడు. 90 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో శతకం బాదాడు. కోహ్లీ కెరీర్‌లో ఇది 53వ వన్డే సెంచరీ. మరో ఎండ్‌లో గైక్వాడ్ (105) కూడా అద్భుత శతకం సాధించాడు. గైక్వాడ్ 77 బంతుల్లోనే సెంచరీ చేశాడు. 2 సిక్స్‌లు, 12 ఫోర్లు కొట్టాడు. కెరీర్‌లో తొలి సెంచరీ చేశాడు . అనంతరం యన్‌సెన్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. కోహ్లీ, గైక్వాడ్ మూడో వికెట్‌కు 195 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు.కోహ్లీ, గైక్వాడ్ అవుటైన తర్వాత టీమిండియా పరుగుల వేగం తగ్గింది ( కెప్టెన్ కేఎల్ రాహుల్ (66 నాటౌట్) మరో హాఫ్ సెంచరీ సాధించినప్పటికీ అనుకున్నంత భారీ స్కోరు రాలేదు. సుందర్ ఒక్క పరుగుకే అవుటయ్యాడు. జడేజా వేగంగా పరుగులు చేయలేకపోయాడు. దీంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 358 పరుగులు చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాంచీలో జరిగిన తొలి వన్డేలో టీమిండియా విజయం సాధించి 1-0 ఆధిక్యంలో ఉంది. ఈ రోజు మ్యాచ్‌లో కూడా గెలిస్తే ఈ సిరీస్‌ను టీమిండియా దక్కించుకుంటుంది.

# ఆకాశమే స్టేడియం.. 5500 అడుగుల ఎత్తులో ఫుట్‌బాల్ మ్యాచ్




ఇంటర్నెట్ డెస్క్: రష్యాకు చెందిన అథ్లెట్ సెర్గీ బోయ్‌ట్‌సోవ్ పెద్ద సాహసమే చేశాడు. భూమి నుంచి 5500 అడుగుల ఎత్తులో హాట్ ఎయిర్ బెలూన్ క్రింద తాత్కాలికంగా కట్టిన మైదానంలో ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడేశాడు! ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కి ఈ వీడియో తెగ థ్రిల్ పంచేస్తుంది.బోయ్‌ట్‌సోవ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన వీడియోలో.. పూర్తిగా ఫుట్‌బాల్ గేర్‌లో ఉన్న ఆటగాళ్లు కనిపిస్తారు. అయితే సాధారణ దుస్తులు కాకుండా వీరి వెనుక పారాషూట్ బ్యాగులు కనిపిస్తాయి. వేల అడుగుల ఎత్తులో తేలుతూ పరుగులు, టాకిల్స్, గోల్స్ అన్నీ సాధారణంగా భూమిపై ఆడినట్టే ఆడేశారు. పైన ఓ విమానం చుట్టూ తిరుగుతూ ఈ అద్భుత దృశ్యాలను కెమెరాలో బంధిస్తోంది. హాట్ ఎయిర్ బెలూన్‌కి తాళ్లతో కట్టిన చిన్న ఫీల్డ్‌పై చిన్నచిన్న బొమ్మల్లా కదులుతున్న ప్లేయర్లు? ఆకాశం నీలంగా మెరిసిపోతూ అద్భుతంగా కనిపిస్తుంది.

ప్రపంచ రికార్డు..బోయ్‌ట్‌సోవ్ ఈ సాహసాన్ని చేయడమే కాదు.. దీన్ని ప్రపంచ రికార్డుగా ప్రకటించాడు కూడా! '1,800 మీటర్ల ఎత్తులో ప్రపంచపు తొలి హాట్ ఎయిర్ బెలూన్ ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడేశాం' అని ఇన్‌స్టాలో వీడియోకి క్యాప్షన్ జత చేశాడు. ఈ వీడియో ఇప్పటికే ఇన్‌స్టాలో 44 మిలియన్ వీక్షణలు దాటేసింది. ఎక్స్‌లో కూడా క్లిప్స్‌ల వర్షం కురుస్తూనే ఉంది.

కొత్తేమీ కాదు..

బోయ్‌ట్‌సోవ్‌కి ఇవి కొత్తేమీ కావు. గతంలో కూడా 1,500 మీటర్ల ఎత్తులో ఏరియల్ జిమ్నాస్టుల వీడియోలు రిలీజ్ చేశాడు. జూన్‌లో పోస్ట్ చేసిన ఓ స్టంట్ కూడా లక్షల వీక్షణలు సాధించింది. బెలూన్లపై బాక్సింగ్, టేబుల్ టెన్నిస్ ఇలా ఎన్నో క్రీడలను కూడా అతను ఎక్స్‌ట్రీమ్ స్పోర్ట్స్‌గా మార్చేశాడు. కానీ? ఈ 'ఆకాశ ఫుట్‌బాల్ మ్యాచ్' మాత్రం నెటిజన్ల ఊహలకు అందని విజువల్. గాల్లో రొనాల్డో స్టైల్ 'సియూ' సెలబ్రేషన్ కూడా దీనిని మరింత వైరల్ చేసింది. ఈ హై-ఆల్టిట్యూడ్ ఫుట్‌బాల్ నిజంగానే ట్రెండ్ అవుతుందో లేదో తెలియదు గానీ? బోయ్‌ట్‌సోవ్ మాత్రం ప్రపంచాన్ని తిరిగి పైకి చూసేలా మరోసారి చేశాడంతే!

# టాస్ ఓడిన భారత్

టీమిండియా-సౌతాఫ్రికా మధ్య రెండో వన్డే రాయ్‌పూర్ వేదికగా మరికాసేపట్లో ప్రారంభం కానుంది. టాస్ గెలిచిన సౌతాఫ్రికా.. ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత టీమిండియా బ్యాటింగ్‌కు దిగనుంది. కాగా వన్డేల్లో భారత్ 20వ సారి టాస్ ఓడటం గమనార్హం.




టాస్ సందర్భంగా కెప్టెన్లు మాట్లాడారు.'మేము బౌలింగ్ ఎంచుకుంటున్నాం. డ్యూ ప్రభావం ఉంటుంది కాబట్టి రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ మాకు సులువు అవుతుంది. జట్టులో మూడు మార్పులు జరిగాయి. ఈ రెండో వన్డేకు నేను, కేశవ్ మహరాజ్, ఎంగిడి అందుబాటులోకి వచ్చాం. మా జట్టుకు బౌలర్లు శుభారంభాన్ని అందిస్తే.. గెలుపు మాదే. తొలి వన్డే విషయం పక్కన పెడితే.. ఈ మ్యాచ్‌లో కచ్చితంగా గెలుస్తామనే నమ్మకంతో బరిలోకి దిగుతున్నాం' అని సఫారీల కెప్టెన్ టెంబా బవూమా తెలిపాడు.'సుదీర్ఘ కాలంగా వన్డేల్లో మేం టాస్ ఓడిపోతున్నాం. టాస్ కంటే డ్యూనే ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. టాస్ ఓడినా తొలి వన్డేలో విజయం సాధించాం. అదే పట్టుదలతో రెండో వన్డే ఆడనున్నాం. భారీ స్కోరు చేసి.. వికెట్లు పడకుండా చూసుకుంటే విజయం మాదే. పిచ్ మాత్రం బ్యాటింగ్‌కే అనుకూలిస్తుంది అనుకుంటున్నా. తుది జట్టులో మార్పు లేదు' అని టీమిండియా కెప్టెన్ కేఎల్ రాహుల్ వెల్లడించాడు.

భారత్ తుది జట్టు:

యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, వాషింగ్టన్ సుందర్, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్, కెప్టెన్), రవీంద్ర జడేజా, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ కృష్ణ.

సౌతాఫ్రికా తుది జట్టు:క్వింటన్ డికాక్ (వికెట్ కీపర్), ఐడెన్ మార్‌క్రమ్, టెంబా బవుమా (కెప్టెన్), మాథ్యూ బ్రీట్జ్కే, టోనీ డీ జోర్జి, డెవాల్డ్ బ్రెవిస్, మార్కో యాన్సన్, కోర్బిన్ బాష్, కేశవ్ మహరాజ్, నాంద్రే బర్గర్, లుంగి ఎంగిడి.

# ఐదెన్ మార్‌క్రమ్ సూపర్ సెంచరీ..

## రెండో వన్డేలో సఫారీల అద్భుత పోరాటం..




టీమిండియా నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు దీటుగా స్పందిస్తున్నారు. ముఖ్యంగా ఓపెనర్ ఐడెన్ మార్‌క్రమ్ (110) భారత బౌలర్లను ఓ ఆట ఆడుకున్నాడు. 4 సిక్స్‌లు, 10 ఫోర్లతో సెంచరీ చేసి భారత బౌలర్ల గుండెల్లో గుబులు రేపాడు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 358 పరుగులు చేసింది358 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ఆదిలోనే వికెట్ కోల్పోయింది. 8 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద అర్ష్‌దీప్ బౌలింగ్‌లో ఓపెనర్ క్వింటెన్ డికాక్ వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ తెంబా బవుమా (46) మార్‌క్రమ్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను నిర్మించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 101 పరుగులు జోడించారు. ఈ జంటను ప్రసిద్ధ్ కృష్ణ విడదీశాడు. బవుమాను అవుట్ చేశాడు. కాసేపటికే మార్‌క్రమ్ కూడా వెనుదిరిగాడు. హర్షిత్ రాణా బౌలింగ్‌లో రుతురాజ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు ప్రస్తుతం దక్షిణాఫ్రికా 30 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసింది ఈ మ్యాచ్‌లో గెలవాలంటే దక్షిణాఫ్రికా మిగిలిన 120 బంతుల్లో 162 పరుగులు చేయాలి. కాగా, అంతకు ముందు బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 358 పరుగులు చేసింది. రుతురాజ్ గైక్వాడ్ (105), విరాట్ కోహ్లీ (102) అద్భుత శతకాలు సాధించారు. కెప్టెన్ కేఎల్ రాహుల్ (66 నాటౌట్) మరోసారి కీలక హాఫ్ సెంచరీ చేశాడు.

# దక్షిణాఫ్రికాతో తలపడే టీమిండియా టీ20 జట్టు ఇదే..




టెస్ట్, వన్డే సిరీస్ తర్వాత భారత్, దక్షిణాఫ్రికాలు టీ-20 ఫార్మాట్‌లో తలపడబోతున్నాయి. డిసెంబర్ 9వ తేదీ నుంచి భారత్, దక్షిణాఫ్రికా మధ్య ఐదు మ్యాచ్‌ల టీ-20 సిరీస్ ప్రారంభం కాబోతోంది. ఈ సిరీస్ కోసం సెలక్టర్లు తాజాగా టీమిండియా జట్టును ప్రకటించారు. సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని 15 మంది సభ్యులతో కూడిన టీమిండియాను ప్రకటించారుచాలా రోజులుగా క్రికెట్‌కు దూరంగా ఉన్న ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఈ సిరీస్‌తో పునరాగమనం చేయబోతున్నాడు. ఇక, టెస్ట్ సిరీస్‌లో గాయపడి వన్డే సిరీస్‌కు దూరమైన శుభ్‌మన్ గిల్ కూడా తిరిగి జట్టుతో చేరబోతున్నాడు. బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్లియరెన్స్ ఇస్తే గిల్ టీ-20 మ్యాచ్‌లు ఆడతాడు. ఫామ్ లేమితో సతమతమవుతున్న రింకూ సింగ్‌పై వేటు పడిందిటీమిండియా టీ20 జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్ధిక్ పాండ్యా, శివమ్‌దూబే, జితేశ్ శర్మ, సంజూ శాంసన్, అక్షర్ పటేల్, బుమ్రా, వరుణ్ చక్రవర్తి, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రానా, వాషింగ్టన్ సుందర్

ఐదు మ్యాచ్‌లు టీ-20 సిరీస్ షెడ్యూల్..

తొలి టీ-20 - డిసెంబర్ 9 (కటక్)

రెండో టీ-20 - డిసెంబర్ 11 (ముల్లాన్‌పూర్)

మూడో టీ-20 - డిసెంబర్ 14 (ధర్మశాల)

నాలుగో టీ-20 - డిసెంబర్ 17 (లఖ్‌నవూ)

ఐదో టీ-20 - డిసెంబర్ 19 (అహ్మదాబాద్)

# గైక్వాడ్, కోహ్లీ సెంచరీలు.. భారీ స్కోరు దిశగా టీమిండియా..

కింగ్ విరాట్ కోహ్లీ మరోసారి తన విశ్వరూపం ప్రదర్శించాడు. వరుసగా రెండో సెంచరీ సాధించాడు. యువ ఆటగాడు రుతురాజ్ గైక్వాడ్ కూడా తొలి శతకంతో మెరిశాడు. ఈ ఇద్దరు ఆటగాళ్లు చెలరేగడంతో దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో వన్డేలో టీమిండియా భారీ స్కోరు దిశగా సాగుతోంది. రాయ్‌పూర్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు టీమిండియా బ్యాటర్లు చుక్కలు చూపించారు రాంచీలో జరిగిన తొలి వన్డేలో సెంచరీ చేసిన కింగ్ కోహ్లీ తన ఫామ్‌ను కొనసాగించి ఈ రోజు మరో సెంచరీ చేశాడు. 90 బంతుల్లో శతకం బాదాడు. 7 ఫోర్లు, 2 సిక్స్‌లతో హోరెత్తించాడు. కోహ్లీ కెరీర్‌లో ఇది 53వ వన్డే సెంచరీ. మరో ఎండ్‌లో గైక్వాడ్ (105) కూడా అద్భుత శతకం సాధించాడు. గైక్వాడ్ 77 బంతుల్లోనే సెంచరీ చేశాడు. 2 సిక్స్‌లు, 12 ఫోర్లు కొట్టాడు. కెరీర్‌లో తొలి సెంచరీ చేశాడుకోహ్లీ, గైక్వాడ్ మూడో ( ప్రస్తుతం టీమిండియా 38 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 275 పరుగులు చేసింది. కోహ్లీతో పాటు కెప్టెన్ రాహుల్ క్రీజులో ఉన్నాడు. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాంచీలో జరిగిన తొలి వన్డేలో టీమిండియా విజయం సాధించి 1-0 ఆధిక్యంలో ఉంది. ఈ రోజు మ్యాచ్‌లో కూడా గెలిస్తే ఈ సిరీస్‌ను టీమిండియా దక్కించుకుంటుంది.






# అంతా దేవుడు దయ అనేసిన నటి!

: ప్రణాళిక అన్నది అందరి విషయంలో ఒకేలా ఉండదు. కొందరి ప్రణాళిక సక్సెస్ అవుతుంది. మరికొంత మందిది ఫెయిల్ అవుతుంది. అందుకు కారణాలు అనేకం. కానీ దాని వెనుక దేవుడి రాత అన్నది ఒకటి రాసిపెట్టి ఉ ంటుందన్నది కొందరు నమ్మరు. మరికొంత మంది బలంగా విశ్వశిస్తారు. ఈ విషయంలో మలయాళ నటి సంయుక్తా మీనన్ తన కన్నా దేవుడినే ఎక్కువగా నమ్ముతానని చెప్పకనే చెప్పింది. కెరీర్ విషయంలో ఎన్నో ప్రణాళికలతో మొదలు పెడుతుంటాను. కానీ పరిణామాలు అందకు పూర్తి విరుద్దంగా సాగుతుంటాయంది ముందు వెనకా అయిన చిత్రాలు: 'బింబిసార', 'విరూపాక్ష', 'సార్', 'భీమ్లా నాయక్' చిత్రాలకు ఒకేసారి సంతకం చేసానంది. కానీ వాటి విడుదలలు మాత్రం అనుకున్న విధంగా జరగలేదంది. 'ముందు అనుకున్నది వెనక్కి వెళ్లింది. వెనుక అనుకున్నది ముందుగా రిలీజ్ అయింది. అదే తరహాలో ఇప్పుడు కూడా జరుగుతుందని తెలిపింది. 'స్వయంభూ', 'నారీ నారీ నడుమ మురారీ', 'అఖండ-2' తో పాటు పూరి జగన్నాద్ సినిమాలకు ఒకేసారి సంతకం చేసానంది. కానీ 'స్వయంభూ', 'నారీ నారీ నడుమ మురారీ' ఇప్పటికే విడుదలవ్వాలి. కానీ అలా జరగలేదు. వాటికంటే ముందే 'అఖండ 2' రిలీజ్ అవుతుంది. 2026 లో ఆరేడు రిలీజ్ లు: ఇలా రిలీజ్ అన్నది ముందు..వెనుక అవ్వడంపై తానెప్పుడూ నిరుత్సాహపడలేదంది. 'నా ప్రణాళిక కంటే దేవుడి ప్రణాళికగా అవి రిలీజ్ అవుతున్నాయనిపిస్తుంది. ఇలా సాగడమే మేలు అని అనిపిస్తుంది. దైవాన్ని మించి ఏదీ లేదు. అలా జరిగితే సంతోషమే కదా? అని చెప్పుకొచ్చింది. ఏడాది ముగింపులో 'అఖండ 2' తో రాబోతుంది. ఈ ఏడాది రిలీజ్ అవుతున్న ఒకే చిత్రమిది. కానీ 2026 లో మాత్రం సంయుక్త మీనన్ నుంచి వరుస రిలీజ్ లు క



నిపిస్తున్నాయి. దాదాపు ఆరేడు సినిమాలు రిలీజ్ కానున్నాయి. బాలీవుడ్ లో 'క్వీన్ ఆఫ్ క్వీన్స్' లో నటిస్తోంది. ఆ వివరాల్లో మాత్రం గోప్యత: తెలుగులో 'స్వయంభూ', 'నారీ నారీ నడుమ మురారీ', పూరి-విజయ్ సేతుపతి సినిమాల్లో నటిస్తోంది. మాలీవుడ్ లో 'రామ్', కోలీవుడ్ లో 'బెంజ్' లో నటిస్తోంది. ఆన్ సెట్స్ లో ఉన్న ఈ చిత్రాలన్నీ 2026లో రిలీజ్ అయ్యే చిత్రాలే. వీటిపై మంచి అంచనాలున్నాయి. 2024లో కూడా అమ్మడు హీరోయిన్ గా నటించిన సినిమా ఏదీ రిలీజ్ అవ్వలేదు. 'లవ్ మీ' అనే చిత్రంలో గెస్ట్ అప్పిరియన్స్ తో అలరించింది. ఈ రెండేళ్లు గ్యాప్ ఇచ్చినా? కొత్త ఏడాది లో మాత్రం ఏడాదంతా సందడి చేయడం షురూ. అలాగే అమ్మడు మరికొన్ని కొత్త ప్రాజెక్ట్ లకు కమిట్ అయినట్లు ప్రచారం జరుగుతుంది. వాటి వివరాలు మాత్రం గోప్యంగా ఉంచింది.



# రెడ్ కలర్ చీరలో మెస్మరైజ్ చేస్తున్న సమంత!



: అగ్ర కథానాయిక సమంత గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన అద్భుతమైన నటనతో, అందంతో ఎంతోమంది స్టార్ హీరోల సరసన నటించి, భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. ముఖ్యంగా సినిమాల ద్వారా ఎంత క్రేజ్ అయితే అందుకుందో.. వ్యక్తిగతంగా అన్నే విమర్శలు కూడా ఎదుర్కొంది ఈ ముద్దుగుమ్మ. మొదట్లో ప్రముఖ హీరో సిద్ధార్థ్ తో ప్రేమాయణం నడిపిన ఈమె.. ఆ ప్రేమ కొంతకాలం కూడా నిలవలేకపోయింది. ఆ తర్వాత తన తొలి తెలుగు చిత్రం ఏ మాయ చేసావే సినిమాలో హీరోగా నటించిన అక్కినేని వారసుడు నాగచైతన్యతో ప్రేమలో పడింది. దాదాపు ఏడేళ్ల పాటు ప్రేమించుకున్న ఈ జంట పెద్దలను ఒప్పించి మరీ క్రిస్టియన్ , హిందూ సాంప్రదాయ పద్ధతుల్లో వివాహం చేసుకున్నారు. వివాహం తర్వాత మజిలీ అంటూ పలు చిత్రాలలో నటించిన ఈ జంట కలిసి పలు కమర్షియల్ యాడ్స్ లో కూడా నటించారు. ఇక వైవాహిక జీవితంలో అన్యోన్యంగా ఉన్న ఈ జంట అనూహ్యంగా విడాకులు ప్రకటించింది. ముఖ్యంగా నాలుగు ఏళ్లకు విడాకులు ప్రకటించడంతో అభిమానులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద సెలబ్రిటీలు కూడా వీళ్లను కలిపే ప్రయత్నం చేసినా కుదరలేదు. తర్వాత మయోసైటీస్ వ్యాధి బారిన పడి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న ఈమె.. ప్రముఖ బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరుతో ప్రేమలో పడి, ఎట్టకేలకు డిసెంబర్ 1న కోయంబత్తూర్ లోని ఈషా యోగ సెంటర్ సమీపంలో ఉన్న లింగ బైరవి సన్నిధిలో భూత శుద్ధి పద్ధతిలో రెండవ వివాహం చేసుకుంది. ఈ వివాహాన్ని సమంత అధికారికంగా ప్రకటిస్తూ తన ఇంస్టాగ్రామ్ ఖాతా ద్వారా కొన్ని ఫోటోలను కూడా పంచుకుంది. ఇకపోతే ఈరోజు ఆమె స్నేహితురాలు సమంత పెళ్లి వేడుకలకు సంబంధించి..ఎవరూ చూడని కొన్ని ఫోటోలను పంచుకున్నారు. ముఖ్యంగా అందులో సమంత ఎరుపు రంగు చీర కట్టుకొని చాలా క్యాజువల్ లుక్ లో అందంగా కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది. రెడ్ కలర్ చీర కట్టుకున్న ఈమె దీనికి కాంబినేషన్లో రెడ్ కలర్ బ్లౌజ్ తో తన మేకవర్ను ఫుల్ ఫిల్ చేసింది. ముఖ్యంగా జుట్టును బన్ రూపంలో ముడిపెట్టి.. చుట్టూ పూలు పెట్టి చాలా సాంప్రదాయంగా కనిపించింది. ఎరుపు రంగు చీరలో అందరి హృదయాలను దోచుకుంది సమంతా అంటూ నెటిజన్స్ ఈ ఫోటోలు చూసి కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం సమంత కు సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. సమంత విషయానికి వస్తే.. ఒకవైపు హీరోయిన్గా చేస్తూనే మరొకవైపు నిర్మాతగా కూడా తన కెరీర్ ను మొదలుపెట్టింది. ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థను స్థాపించిన ఈమె శుభం అనే సినిమాను నిర్మించి, మంచి విజయాన్ని అందుకుంది. ఇందులో మాయ అనే ఒక చిన్న క్యారెక్టర్ లో నటించి ఆకట్టుకుంది. ప్రస్తుతం నందిని రెడ్డి దర్శకత్వంలో మా ఇంటి బంగారం అనే సినిమా చేస్తోంది. యాక్షన్ పర్ఫామెన్స్ బేస్డ్ గా వస్తున్న ఈ సినిమాపై ఇప్పుడు సమంత అంచనాలు పెట్టుకున్న విషయం తెలిసిందే. అలాగే బాలీవుడ్లో తన భర్త ప్రముఖ డైరెక్టర్ రాజ్ నిడిమోరు దర్శకత్వంలో వస్తున్న రక్త బ్రహ్మండ్ అనే వెబ్ సిరీస్ లో కూడా నటిస్తోంది.

# బిగ్ బాస్ 9.. డేంజర్ జోన్ లో ఆ ఇద్దరు..?

బిగ్ బాస్ సీజన్ 9లో 13వ వారం హౌస్ నుంచి కెప్టెన్ కళ్యాణ్ నామినేషన్స్ నుంచి సేఫ్ అవ్వగా.. ఇమ్మాన్యుయెల్ ని ఎవరు నామినేట్ చేయకపోవడంతో అతను సేఫ్ అయ్యాడు. ఐతే 3 వారాలు ఆట మాత్రమే ఉన్న ఈ టైం లో ఇమ్మాన్యుయెల్ నామినేషన్స్ కి రాకుండా ఉండటం ఆడియన్స్ ని షాక్ అయ్యేలా చేస్తుంది. ఐతే వారిద్దరు కాకుండా మిగిలిన హౌస్ మేట్స్ అంతా కూడా నామినేషన్స్ లో ఉన్నారు. లీస్ట్ టూ గా ఉన్న ఇద్దరిలో.. ఈ వారం నామినేషన్స్ లో భరణి, తనూజ, సుమన్ శెట్టి, డీమాన్ పవన్, రీతు, సంజన ఉన్నారు. ఐతే వీరిలో ఒక ఇద్దరు ముగ్గురికి మాత్రమే రిస్క్ అని తెలుస్తుంది. ముఖ్యంగా లీస్ట్ టూ గా ఉన్న ఇద్దరిలో ఒకరు లేదా ఇద్దరు అయినా ఎలిమినేట్ అయ్యే ఛాన్స్ ఉంటుంది. అన్ అఫీషియల్ ఓటింగ్స్ చూస్తే ఈ వారం సుమన్ శెట్టి దాదాపు ఎలిమినేషన్ పక్కా అనేలా ఉన్నాయి. కొంతమంది సంజనాకి కూడా లీస్ట్ ఓటింగ్ ఉందని అంటున్నారు. ఇది కదా అసలైన విజయం ఏది ఏమైనా ఈ వారం సంజన, సుమన్ శెట్టి ఈ ఇద్దరిలో ఒకరు బిగ్ బాస్ హౌస్ నుంచి ఎలిమినేట్ అవుతారని తెలుస్తుంది. అసలైతే భరణి కూడా ఈ లిస్ట్ లో ఉండాలి కానీ గత రెండు వారాలుగా భరణి యాక్టివ్ గా ఉంటున్నాడు. తను ఎంజాయ్ చేస్తూ హౌస్ లో అందరినీ ఎంటర్టైన్ చేస్తున్నాడు. అందుకే ఈ వారం భరణి దాదాపు సేఫ్ అయ్యే ఛాన్స్ లు కనిపిస్తున్నాయి. సంజన హౌస్ లో ఫుల్ ఫైట్స్.. ఐతే హౌస్ లో సుమన్ శెట్టి లోన్లీగా ఉంటున్నాడు. అతనిలో ఎందుకో అంత ఎనర్జీ కనిపించట్లేదు. 13 వారాలు దాకా ఉన్నాం చాలు అన్నట్టుగా సుమన్ శెట్టి ఫీలవుతున్నాడని అనిపిస్తుంది. మరోపక్క సంజన హౌస్ లో గత వారం వరకు ఫుల్ ఫైట్స్ చేసింది. రీతు, డీమాన్ ఇష్యూ వల్ల సంజన మీద కాస్త నెగిటివిటీ వచ్చింది. ఐనా సరే ఆడియన్స్ ఆమెను సేఫ్ చేస్తూ వచ్చారు. ఈ వారం ఆమె సేఫ్ అయితే ఆట మరింత టఫ్ గా ఆడే ఛాన్స్ ఉంటుంది. ఐతే సుమన్ లేదా సంజన ఈ ఇద్దరిలో ఒకరు ఈ వారం ఎలిమినేట్ అవుతారని అంచనా వేస్తున్నారు. బిగ్ బాస్ సీజన్ 9లో ప్రస్తుతం ఎనిమిది మంది కంటెస్టెంట్స్ మాత్రమే ఉన్నారు. రాబోయే రెండు వారాల్లో ఎలిమినేషన్స్ జరిగితే టాప్ 5 లేదా 6 ఎవరన్నది ఫైనల్ అవుతుంది. ఐతే ప్రస్తుతం హౌస్ లో టికెట్ టు ఫినాలే టాస్క్ నడుస్తుంది. మొదటి రౌండ్ లోనే సంజనా ఆట నుంచి ఎలిమినేట్ అయ్యింది. సో ఈ వారం ఆమెకు ఇదొక పెద్ద దెబ్బ అని చెప్పొచ్చు.



# శ్రీవారి సన్నిధానంలో ఆ ఇద్దరు..మాజీ నుంచి మరో పోస్ట్!



తమిళ నటుడు జయం రవి- భార్య ఆర్తిల విడాకుల వ్యవహారం కోర్టులో నలుగుతోన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా మరోసారి జయం రవి స్నేహితురాలు కెన్నీషాతో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఇరువురు స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం రంగ నాయకుల మండపంలో పండితలు ఆశీర్వచనం అందుకుని స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందుకున్నారు. సరిగ్గా ఇదే సన్నివేశం నాలుగు నెలల క్రితం కూడా చోటు చేసుకుంది. అప్పుడు కూడా జయం రవి కెన్నీషాతో కలిసి పూజలో పాల్గొన్నారు. ఆ సమయంలో భార్య ఆర్తితో విడాకుల వ్యావహారంపై నెట్టింట వాడివేడి చర్చ జరుగుతుండేది. అప్పటికే ఇరువురు పబ్లిక్ వేదికల్లో ఎక్కువగా పాల్గొనే వారు. జంటగా వివాహ వేడుకలకు హాజరవ్వడం, ఈవెంట్లతో పాటు ఆలయాలకు కూడా కలిసే రావడం సినీ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చనీయంశం అయింది. సరిగ్గా అదే సమయంలో ఆర్తి ఓ సంచలన పోస్ట్ కూడా చేసారు. 'నువ్వు ఇతరులను మోసం చేయొచ్చు. నిన్ను నువ్వు మోసం చేసుకోవచ్చు. కానీ దేవుడిని మోసం చేయలేవు' అంటూ పోస్ట్ పెట్టారు. రవి-ఆర్తి మధ్య విబేధాల నేపథ్యంలో పెట్టిన పోస్ట్ అది. ఏడాదిలో రెండవ సారి: తాజాగా మరోసారి నేడు శ్రీవారి చెంత జంటగా హాజరైన నేపథ్యంలో ఆర్తి మళ్లీ రియాక్ట్ అవుతుందా? అన్న చర్చ నెట్టింట జరుగుతోంది. ఇప్పటికే జయం రవి ఆర్తితో కలిసి జీవించలేనని కోర్టకు వివరించాడు. దీంతో ఆర్తి 50 లక్షల భరణం కావాలని కోరింది. కెన్నీషా వల్లే తమ వైవాహిక జీవితంలో సమస్యలొచ్చాయని వివాదం నాటి నుంచి ఆమెతో పబ్లిక్ లో ఎక్కువగా కనిపించడంతో? ఇదంతా ప్రతీకార చర్యగా దిగాడా? అన్న సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కొన్ని నెగిటివ్ కామెంట్లను కూడా రవి ఎదుర్కోవాల్సి వచ్చింది.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell** SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya** 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/20**